# శిక్షణ పేరుతో బస్తర్‌లో జరుగుతున్న భారత సైన్యం మోహరింపుకు వ్యతిరేకంగా గొంతెత్తుదాం!

# ప్రజలపై ప్రభుత్వాలు సాగిస్తున్న అన్యాయ యుద్ధాన్ని ఆపాలంటూ

# విస్తృత, సమైక్య, సమరశీల ప్రజా వుద్యమాన్ని నిర్మిద్దాం!

# ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఎదిరించి పోరాడుతున్న పీడిత ప్రజలకు అండగా నిలుద్దాం!

**మిత్రులారా! కామ్రేడ్స్!**

గత సంవత్సరంనర కాలంగా ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్[1] ప్రాంతంలో జరుగుతున్న సైన్యం మోహరింపు గురించి మనందరం వింటూ, ఆందోళన చెందుతూ వస్తున్నాం. సైన్యం మోహరింపు గురించి, మొత్తంగా దేశ ప్రజలపై ప్రభుత్వాలు సాగిస్తున్న యుద్ధం గురించి మాట్లాడుకోవడానికి మనందరం సరిగ్గా ఇక్కడ సమావేశమైన సమయంలో ఛత్తీస్‌గఢ్‌లోని కొండగాం, నారాయణపూర్ జిల్లా కేంద్రాలను కలిపే రోడ్డుపై, కొక్కోడి గ్రామ పరిసరాల్లో భారత సైన్యానికి చెందిన ఒక బ్రిగేడ్ అటవీ యుద్ధతంత్రంలో శిక్షణ పొందుతున్నది. ఈ బ్రిగేడ్ 2012 మార్చ్ రెండో వారంలో ఇక్కడికి చేరుకుంది. ఇంతకు మునుపు రెండు బ్రిగేడ్‌లు కొండగాం, నారాయణపూర్ జిల్లాల్లో తమ శిక్షణా కార్యక్రమాల్ని పూర్తి చేసుకున్నాయి. మొట్టమొదట, 2011 మే చివరలో సైన్యానికి చెందిన మౌంటెన్ బ్రిగేడ్ జవాన్లు 1700 మంది బస్తర్ గడ్డపై కాలుమోపారు. వాళ్ల శిక్షణ పూర్తయిన తర్వాత రెండో బ్రిగేడ్ ఇక్కడికి వచ్చిపోయింది. మొదటి బ్రిగేడ్ శిక్షణ రాయపూర్-జగ్దల్‌పూర్ హైవేపై వున్న మసోరా అనే గ్రామం దగ్గర జరగగా, రెండో బ్రిగేడ్ శిక్షణ కొండగాం-నారాయణపూర్ రోడ్డుపై వున్న బూనాగాం గ్రామ సమీపంలో పూర్తయింది. ఇప్పుడు నారాయణపూర్ పట్టణం దిశగా మరింత ముందుకు వచ్చి కొక్కోడిలో శిక్షణ పొందుతున్నారు. క్రమంగా నారాయణపూర్ పట్టణాన్ని దాటేసి మాడ్ (అబూజ్‌మాడ్) లోతట్టు ప్రాంతంలోకి చొరబడేందుకు పథకం ప్రకారమే సైన్యం ముందుకు కదులుతున్నదనేది స్పష్టం. సైన్యానికి 'శిక్షణ' కోసం అంటూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కేటాయించిన 750 చ.కి.మీ. ప్రాంతాన్ని క్రమక్రమంగా ఆక్రమించుకునే కసరత్తే ఇదంతా.

2012 ఏప్రిల్ రెండో వారంలో సైన్యాధిపతి జనరల్ వి.కె. సింగ్ తమ జవాన్ల శిక్షణను పర్యవేక్షించి, ప్రతిపాదిత శిక్షణా స్థలాన్ని వాయుమార్గం గుండా సర్వే చేశాడు. దీనికి ముందు ఏప్రిల్ మొదటి వారంలో లక్నో సెంట్రల్ కమాండ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చైత్, మధ్య భారత ఏరియా కమాండ్ జబల్‌పూర్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ ఆర్.ఎస్. ప్రధాన్, సి.ఓ.ఎస్.ఏ. (ఛత్తీస్‌గఢ్-ఒడిశా సబ్ ఏరియా) కమాండ్‌కు చెందిన బ్రిగేడియర్ అమ్రీక్ సింగ్‌లు బస్తర్ పర్యటన జరిపారు. వాళ్లు కొండగాం, నారాయణపూర్ జిల్లాల్లో కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని సమీక్షించారు.

ఇవన్నీ గమనించినపుడు, ప్రజలపై ప్రభుత్వాలు సాగిస్తున్న అన్యాయ యుద్ధంలో సైన్యం మోహరింపు, దానికి అవసరమైన అన్ని సన్నాహాలు పెద్ద ఎత్తున వేగంగా పూర్తవుతున్నాయి. నిజానికి మావోయిస్టు ప్రజాయుద్ధాన్ని అధ్యయనం చేయడం, పర్యవేక్షించడం కోసం సైన్యం చాలా ముందుగానే ఒక నోడల్ సెల్‌ను ఏర్పాటు చేసింది. దేశం మధ్య, తూర్పు భాగాలలో సాగుతున్న మావోయిస్టు వుద్యమాన్ని సమూలంగా అణచివేసే దీర్ఘకాలిక దృష్టితో రెండు సబ్ ఏరియా హెడ్‌క్వార్టర్స్ - ఒక్కో దానిలో 15 వేల మంది సైనికులతో - ఏర్పాటు కాబోతున్నాయి. ఒకటి బస్తర్‌లోని జగ్దల్‌పూర్‌లో కాగా, మరొకటి ఒడిశా-బెంగాల్ సరిహద్దులో గల అంబర్దా దగ్గర. సబ్ ఏరియా కమాండ్ హెడ్‌క్వార్టర్స్ కార్యాలయాన్ని లాంఛనంగా ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయపూర్‌లో ప్రారంభించారు. బిలాస్‌పూర్‌కు దగ్గరలో వున్న చకర్‌భాంతా గ్రామంలో 1800 ఎకరాల భూమిని రైతుల నుండి బలవంతంగా ఆక్రమించుకొని బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సి.ఆర్.పి.ఎఫ్.కు యాంటీ ఐ.ఈ.డి. ఆపరేషన్స్‌లో శిక్షణ ఇవ్వడం కోసం విశ్రాంత సైన్యాధికారులను ఉపయోగించుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులో సరాయిపాలీకి సమీపంలో సైన్యానికి చెందిన మరో శిక్షణా స్కూలు ఏర్పాటు కాబోతున్నది.

మావోయిస్టు ప్రాంతాల్లో అడుగుపెట్టడానికి ముందుగానే కేంద్ర రక్షణ, హోం శాఖలు సైన్యానికి 'ఆత్మరక్షణ' పేరిట అనేక అధికారాలు ఇచ్చాయి. 'మార్గదర్శక సూత్రాల' పేరుతో కట్టబెట్టిన ఈ అధికారాలు, సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం (ఎ.ఎఫ్.ఎస్.పి.ఏ.)లోని నిబంధనలు దాదాపు ఒకటే. భూతల సైన్యంతో పాటు వాయుసైన్యం కూడా తన సన్నాహాలలో నిమగ్నమైంది. నిజానికి వాయుసైనిక హెలికాప్టర్ల వినియోగం చాలా ముందు నుండే కొనసాగుతున్నది. ఐ.ఏ.ఎఫ్.కు చెందిన ఎం.ఐ.-17 హెలికాప్టర్లతో పాటు బి.ఎస్.ఎఫ్.కు చెందిన 'ధ్రువ్' హెలికాప్టర్లను మావోయిస్టు ప్రాంతాల్లో సైనిక చర్యల సందర్భంగా సాయుధ బలగాల తరలింపు కోసం విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ హెలికాప్టర్ల ద్వారా సాగించే కంబాట్ సెర్చ్ ఎండ్ రెస్క్యూ ఆపరేషన్లలో ఐ.ఏ.ఎఫ్.కు చెందిన ప్రత్యేక బలగం 'గరుడ్'ను వుపయోగిస్తున్నారు. కేంద్రం ఇచ్చిన హెలికాప్టర్లతో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం స్వంతంగా మరి కొన్ని హెలికాప్టర్లను కిరాయికి తీసుకొని వినియోగిస్తున్నది. దుర్గ్ జిల్లాలోని నందిని దగ్గరలో 300 ఎకరాల భూమిని ఆక్రమించుకొని వాయుసైనిక ఎయిర్‌బేస్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతున్నది. నారాయణపూర్‌లో కూడా ఎయిర్‌బేస్ నిర్మాణం జరుగుతున్నది. మరోవైపు గడ్చిరోలి జిల్లాలో ధనోరా-గడ్చిరోలి రోడ్డుపై వున్న బోదెలి అనే గ్రామంలో ఒక ఎయిర్‌బేస్ నిర్మాణానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. మొత్తం తొమ్మిది 'నక్సల్ ప్రభావిత' రాష్ట్రాల్లో 100 హెలిప్యాడ్‌ల నిర్మాణం సాగుతున్నది.

---

1. *ఈ పేపర్‌లో 'బస్తర్' అని పేర్కొన్న ప్రతి చోటా ప్రస్తుతం దంతెవాడ, బీజాపూర్, సుక్మ, బస్తర్, కొండగాం, నారాయణపూర్, కాంకేర్ - మొత్తం ఏడు జిల్లాలుగా విడగొట్టబడిన పాత అవిభాజిత బస్తర్ ప్రాంతమని గమనించాలి.*

అమెరికా, ఇజ్రాయిల్‌లలో తయారైన మానవరహిత విమానాలను (యు.ఏ.వి.) లేదా డ్రోన్‌లను కూడా పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ఇవి ఎప్పటికప్పుడు ఫోటోల్ని తీసి కింద గెరిల్లాల కదలికల్ని, క్యాంపుల్ని కనిపెట్టి కంట్రోల్ రూంకు పంపిస్తే వాటిని అప్పటికప్పుడే అత్యాధునిక ఉపకరణాల ద్వారా ఆపరేషన్స్ నిర్వహణలో వున్న బలగాలకు అందిస్తారు. రీఛార్జబుల్ బ్యాటరీలతో నడిచే 'నేత్ర' అనే పేరున్న చిన్నపాటి యు.ఏ.వి.లను బలగాలు ఆపరేషన్స్ సందర్భంగా తమ వెంట మోసుకొచ్చి వుపయోగిస్తున్నారు. మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో కొత్తగా 1800 మొబైల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో ప్రాంతీయ నావిగేషన్ శాటిలైట్ వ్యవస్థ ఏర్పాటవుతున్నది.

పైవన్నీ కూడా శత్రు దేశాలకు వ్యతిరేకంగా ఆక్రమణదారు సైన్యాలు చేసుకునే యుద్ధ సన్నాహాలను పోలి వున్నాయనేది స్పష్టం. విదేశీ సైన్యాలపై చేసే దాడుల స్థాయిలో ఈ సన్నాహాలు కొనసాగుతున్నాయి. మరి దేశం లోపల ఏ విదేశీ సైన్యాలున్నాయని పాలకులు భావిస్తున్నారు? దేశం నడిబొడ్డున వున్న బస్తర్‌లో ఏ విదేశీ శక్తులున్నాయి? ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చేయడానికి భారత సైన్యం బస్తర్‌లో తిష్ట వేస్తున్నది? దీన్ని వివరంగా తెలుసుకోవడం అవసరం.

### 'శిక్షణ' అనేది పూర్తి స్థాయి యుద్ధ సన్నాహాలను మరుగుపర్చే సాకు!

సైన్యాన్ని దించుతున్నది మావోయిస్టులతో యుద్ధం చెయ్యడానికి కాదని, అర్ధసైనిక, సైనిక బలగాలకు అటవీ యుద్ధతంత్రంలో శిక్షణనివ్వడానికేనని ప్రభుత్వం పదే పదే బుకాయిస్తున్నది. అదే సమయంలో పోలీసు, అర్ధసైనిక బలగాలతో కలిసి సైన్యం సంయుక్త సైనిక చర్యల రిహార్సల్స్‌లో పాల్గొంటుందని కూడా ప్రకటించింది. అంటే విశాల ప్రాంతాన్ని చుట్టుముట్టి అక్కడ మాపింగ్-అప్ చర్యలను చేపట్టి 'అన్నిటినీ ధ్వంసం చేసే, అన్నిటినీ లూటీ చేసే, అందరినీ చంపేసే' క్యాంపెయిన్‌లను కొనసాగిస్తారని అర్థం. ఇటీవల, 2012 మార్చ్ నెల రెండో, మూడో వారాల్లో మాడ్ ప్రాంతంలో 3 వేల బలగాలతో, మూడు వైపుల నుండి నిర్వహించిన దాడులు దీనికి ఒక రిహార్సల్‌గా చెప్పవచ్చు. **నిజానికి సైన్యం వస్తున్నది కేవలం శిక్షణ కోసమేనని చెప్పడం అబద్ధం. అది వస్తున్నది యుద్ధం చెయ్యడానికే. అది ప్రస్తుతం కొనసాగిస్తున్న శిక్షణ కూడా ఈ యుద్ధం కోసమే.**

బస్తర్‌లో సైన్యం మోహరింపు కేవలం బస్తర్‌కు లేదా దండకారణ్యానికి[2] పరిమితమైంది కాదు. మావోయిస్టు వుద్యమాన్ని సమూలంగా అణచివేసే లక్ష్యంతో పాలకవర్గాలు సాగిస్తున్న దేశవ్యాప్త అణచివేత యుద్ధంలో భాగం ఇది. అత్యంత పీడిత, అణగారిన వర్గాల ప్రజలపైన, ఆదివాసులపైన రుద్దిన యుద్ధం ఇది. ఆగస్టు 2009 నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో మొదలైన ఈ యుద్ధం దేశంలోని తొమ్మిది రాష్ట్రాలలో - ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో కొనసాగుతున్నది. ఈ యుద్ధం కోసం పాలకవర్గాలు వివిధ సాయుధ బలగాలకు చెందిన దాదాపు 4 లక్షల జవాన్లను సమీకరించాయి. కాశ్మీర్ నుండి పెద్ద ఎత్తున సి.ఆర్.పి.ఎఫ్. బెటాలియన్లను వెనక్కి తెచ్చి ఈ యుద్ధంలోకి దించాయి. స్థానిక పోలీసు బలగాలతో పాటు, రాష్ట్రాల ప్రత్యేక పోలీసు బలగాలు, ప్రత్యేక కమాండో బలగాలు, 70కి పైగా అర్ధసైనిక బెటాలియన్లు (సి.ఆర్.పి.ఎఫ్.-కోబ్రా, బి.ఎస్.ఎఫ్., ఐ.టి.బి.పి.), ఇండియా రిజర్వ్ బెటాలియన్ మొదలైన బలగాలను ఈ యుద్ధంలో మోహరించారు. సైన్యానికి చెందిన కౌంటర్-ఇన్‌సర్జెన్సీ బలగాలైన రాష్ట్రీయ రైఫిల్స్‌ను కాశ్మీర్ నుండి రప్పించి దేశం నడిమధ్యలో దించే ప్రతిపాదన కూడా ముందే తయారైన ఈ యుద్ధ పథకంలో భాగంగా వుంది.

దండకారణ్యంలో 70 వేలకు పైగా స్థానిక పోలీసు, సి.ఏ.ఎఫ్., ఎస్.టి.ఎఫ్., ఎస్.ఆర్.పి., సి-60, సి.ఆర్.పి.ఎఫ్.-కోబ్రా, బి.ఎస్.ఎఫ్., ఐ.టి.బి.పి., కోయ కమాండో/ఎస్‌పీవో (సుప్రీంకోర్టు తీర్పు తర్వాత ప్రస్తుతం 'ఛత్తీస్‌గఢ్ సహాయ సాయుధ బలగాలు'గా పేరు మార్చారు) బలగాలను మోహరించారు. ప్రతి 3-7 కిలోమీటర్ల దూరానికి ఒకటి చొప్పున ఏర్పర్చిన పోలీసు స్టేషన్లలో, క్యాంపుల్లో, బేస్ క్యాంపుల్లో ఈ బలగాలను దించి చాలా ప్రాంతాల్లో కార్పెట్ సెక్యూరిటీ వ్యవస్థను నెలకొల్పారు. ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే వున్నది. పాఠశాల, ఆశ్రమ పాఠశాల, అంగన్‌వాడీ భవనాలను సాయుధ బలగాలు ఆక్రమించుకునే క్రమం సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కూడా నిరాటంకంగా కొనసాగుతూనే వున్నది. కొత్త కొత్త పోలీసు ట్రెయినింగ్ స్కూళ్లు, జంగల్ వార్‌ఫేర్ కాలేజ్‌లు ఎడతెగకుండా వెలుస్తూనే వున్నాయి.

### విప్లవోద్యమ నిర్మూలన లక్ష్యంతో సాగుతున్న అణచివేత క్యాంపెయిన్లు

సైన్యం మార్గదర్శకత్వంలో రూపొందిన అణచివేత పథకంలో భాగంగా 2005-09 మధ్య కాలంలో పశ్చిమ, దక్షిణ బస్తర్ ప్రాంతంలో సాగిన సల్వాజుడుం దాడిలో 700 గ్రామాలు కాల్చివేయబడ్డాయి. దాదాపు 1500 మంది ఆదివాసులను ప్రభుత్వ సాయుధ బలగాలు, ప్రభుత్వ ప్రాయోజిత గూండాలు క్రూరంగా హత్య చేశారు. వందలాది మహిళలపై అమానుష అత్యాచారాలు చేశారు. 50 వేల మందికి పైగా ప్రజలను 'సహాయ' శిబిరాలుగా ప్రచారం చేసిన కాన్‌సెంట్రేషన్ క్యాంపుల్లోకి ఈడ్చుకెళ్లారు. మరెందరినో భయంతో ఇరుగుపొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లే దుస్థితికి నెట్టారు.

ఆగస్టు 2009 మధ్య నుండి యు.పి.ఏ.-2 ప్రభుత్వ ప్రత్యక్ష నాయకత్వంలో, సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల పూర్తి అండదండలతో, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో ఇప్పటి వరకు దండకారణ్య వ్యాప్తంగా దాదాపు 250 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఎన్నో సామూహిక హత్యాకాండలు జరిగాయి. రెండేళ్ల పసిపిల్లల నుండి 70 ఏళ్ల వృద్ధుల దాకా ఎందరో పోలీసుల దెబ్బలకు, అత్యాచారాలకు, అమానుషత్వానికి గురయ్యారు. గ్రామాలపై సాగిస్తున్న దారుణ బీభత్సానికి నిరుడు చింతల్‌నార్ ప్రాంతంలో ప్రభుత్వ బలగాలు సాగించిన విధ్వంసకాండ ఒక వుదాహరణగా నిలుస్తుంది. బూటకపు ఎన్‌కౌంటర్లు,

---

*2. 'దండకారణ్యం'గా ప్రస్తుతం పేర్కొంటున్న ప్రాంతంలో మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, ఛత్తీస్‌గఢ్‌లోని అవిభాజిత బస్తర్ ప్రాంతంతో పాటు, రాజ్‌నాంద్‌గాం జిల్లాలోని దక్షిణ ప్రాంతం వస్తాయి.*

మహిళలపై అత్యాచారాలు, విచ్చలవిడి అరెస్టులు, చిత్రహింసలు, లాకప్ హత్యలు, మాయం చేసే సంఘటనలు ఆగకుండా సాగుతూనే వున్నాయి. ఇక ఇప్పుడు ఈ అన్యాయ యుద్ధంలో సైన్యాన్ని ప్రత్యక్షంగా దించడం ద్వారా ప్రజలపై సాగుతున్న హింసా విధ్వంసాలు, హత్యాకాండలు ఎంత తీవ్ర స్థాయికి చేరుతాయో వూహించవచ్చు. ఈశాన్య ప్రాంత రాష్ట్రాల్లో, కాశ్మీర్‌లో ఏం జరుగుతున్నదో మనందరికీ తెలిసిందే.

నిజానికి మావోయిస్టు వుద్యమ అణచివేత చర్యలలో, ఫాసిస్టు నిర్బంధ క్యాంపెయిన్లలో 2004 నుండి 2010 చివరి దాకా సైన్యం పరోక్ష పాత్రను పోషిస్తూ వస్తున్నది. అయితే మావోయిస్టు పార్టీకి చెందిన ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పి.ఎల్.జి.ఏ.) మొదట సల్వాజుడుంను, ఆ తర్వాత ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించే లక్ష్యంతో కొనసాగించిన ఆత్మరక్షణా యుద్ధంలో సి.ఆర్.పి.ఎఫ్.కు దెబ్బపై దెబ్బ తగులుతూ రావడంతో, ప్రత్యేకించి 2010 ఏప్రిల్ 6న జరిగిన, 76 మంది జవాన్ల దుర్మరణానికి దారితీసిన తాడిమెట్ల (ముకురం) ఆంబుష్ నేపథ్యంలో జనవరి 2011 నుండి సైన్యం ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడం ప్రారంభమైంది. ఈ ఆంబుష్‌పై స్పందిస్తూ సైన్యాధిపతి వి.కె. సింగ్ "హోంమంత్రి చిదంబరం పూనికతో రూపొందిన పథకంలో భాగంగా సైన్యం ఇప్పటి వరకు 39,000 భద్రతా బలగాలకు జంగల్ వార్‌ఫేర్‌లో శిక్షణ ఇచ్చింది" అని అన్నాడు. అంటే అప్పటికే సైన్యం ఎంత క్రియాశీలంగా పని చేస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. మాడ్ ప్రాంతంతో పాటు సరాయిపాలీ దగ్గరలో సైన్యం శిక్షణా స్కూలును ప్రారంభించడం వెనుక ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులో పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని అణచివేసే, మధ్య–తూర్పు భారతంలోని విప్లవోద్యమ ప్రాంతాలు భౌగోళికంగా ఒకటిగా కలవకుండా చేసే కుట్రలు దాగి వున్నాయి. **మొత్తంగా చూసినపుడు దేశంలో, ముఖ్యంగా తూర్పు, మధ్య ప్రాంతాల్లో పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని, భవిష్యత్తులో ఇది మరింత వుధృతం కాగల అవకాశాలను దృష్టిలో వుంచుకునే భారత పాలకవర్గాలు ఈ నిర్ణయానికి వచ్చాయనేది స్పష్టం.**

## 'ప్రజలపై యుద్ధం'లో పార్లమెంటరీ పార్టీల కుమ్మక్కు

'ప్రజలపై యుద్ధం'లో, సైన్య మోహరింపు విషయంలో కేంద్రంలోని యు.పి.ఏ. ప్రభుత్వానికి బి.జె.పి. పూర్తిగా మద్దతునిస్తున్నది. నిజానికి అది సైన్యాన్ని దించాలని ముందు నుండే పట్టుబడుతున్నది. అది పాలిస్తున్న ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో అణచివేత చర్యలకు కేంద్రం కూడా ఇతోధికంగా సహాయపడుతున్నది. కోరినన్ని నిధులు, వనరులు, బలగాలను కేటాయిస్తున్నది. సోనియా–మన్మోహన్ సింగ్–చిదంబరం–ప్రణబ్ ముఖర్జీ–జయరాం రమేష్‌ల పాలక ముఠా నాయకత్వం వహిస్తున్న ఈ అన్యాయ యుద్ధంలో రమన్‌సింగ్, నవీన్ పట్నాయక్, నితీష్ కుమార్, మమతా బెనర్జీ తదితరులంతా తమ రాజకీయ విభేదాలన్నిటినీ పక్కన బెట్టి క్రియాశీలంగా పాలు పంచుకుంటున్నారు. వామపక్షాలనబడే సి.పి.ఐ., సి.పి.ఎం. తదితర పార్టీలు 'ప్రజలపై యుద్ధాన్ని' నిర్ద్వంద్వంగా ఖండించకపోవడం, సైన్యం మోహరింపును ఆపాలని కచ్చితంగా డిమాండ్ చేయకపోవడం ద్వారా తమ నిజ స్వభావాన్ని వెల్లడి చేసుకుంటున్నాయి. అలా చూసినపుడు కాంగ్రెస్, బి.జె.పి. సహా దాదాపు పార్లమెంటరీ పార్టీలన్నీ కూడా తమ వర్గ స్వభావం రీత్యా ఈ యుద్ధానికి బలంగా మద్దతునిస్తూ నిలబడ్డాయి. తాము అధికారం సాగిస్తున్న రాష్ట్రాల్లో ఈ పార్టీలు అమలు చేస్తున్న సామ్రాజ్యవాద ప్రాయోజిత నయా వుదారవాద విధానాల నేపథ్యంలోనే వాళ్లు తీసుకున్న ఈ వైఖరిని చూడాల్సి వుంటుంది.

అయితే ఉన్నత సైన్యాధికారుల్లో కొందరికి సైన్యం మోహరింపు పట్ల ఆమోదం లేదు. జూన్ 2011లో జరిగిన సైనిక కమాండర్ల కాన్ఫరెన్స్‌కు హాజరైన అత్యధిక సైన్యాధికారులు, రిటైర్డ్ ఆఫీసర్లు మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో సైన్యాన్ని మోహరించవద్దని బలంగా అభిప్రాయపడ్డారన్నది గమనార్హం. అంతకు మునుపు 2010లో తాడిమెట్ల దాడి దరిమిలా కేంద్ర హోంమంత్రి చిదంబరం వాయుసైన్యం ద్వారా దాడులు జరిపే అవకాశం లేకపోలేదని మాట్లాడినపుడు అప్పటి ఎయిర్ చీఫ్ మార్షల్ పి.వి. నాయక్ ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆయనిలా అన్నాడు – "మిలిటరీ – వాయు సైన్యం, సైన్యం, నావికా సైన్యం – శిక్షణ అత్యధిక సంహారం జరిపేదిగా వుంటుంది తప్ప తక్కువగా వుండదు. మా దగ్గర వుండే ఆయుధాలు దేశ సరిహద్దుల లోపల వుండే శత్రువుల కోసం వుద్దేశించినవి కావు.... వుదాహరణకు ఒకానొక నక్సలైటు ప్రాంతంలో దాడుల కోసం వాయు సైన్యాన్ని దించి రాకెట్ ఫైర్ చేశారనుకుందాం. దాన్ని కనీసం 1500–1800 మీటర్ల దూరం నుంచి ఫైర్ చేయాల్సి వుంటుంది. టార్గెట్ ఏంటో స్పష్టంగా చూడడం ఏ మాత్రం సాధ్యం కానంత దూరం. ఎదురుగా వున్నది శత్రువులే అని 120 శాతం నమ్మకమైన నిఘా సమాచారం వుంటే తప్ప సరిహద్దుల లోపల వాయు సైన్యాన్ని వుపయోగించడం సరి కాదు. నక్సలైట్లు మౌలికంగా మన స్వంత ప్రజలే." తాను వ్యక్తిగతంగా దీనికి వ్యతిరేకమే అయినప్పటికీ వాయు సైన్యాన్ని వుపయోగించే విషయంలో నిర్ణయం తీసుకోవల్సింది ప్రభుత్వమని కూడా ఆయన అన్నాడు. కాని ఇలాంటి వ్యతిరేకతలను, భేదాభిప్రాయాలను అన్నిటినీ తోసిపుచ్చుతూ పాలకవర్గాలు పూర్తి స్థాయిలో సైన్యం మోహరింపుకు త్వరపడుతున్నాయి.

## అమెరికా సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వం, భాగసామ్యం

ఈ యుద్ధంలో భారత పాలకవర్గాలకు సామ్రాజ్యవాదుల నుండి, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల నుండి అన్ని రకాల అండదండలు అందుతున్నాయి. సల్వాజుడుం (2005) ప్రారంభం నుండి దండకారణ్య వుద్యమాన్ని అణచివెయ్యడంలో అమెరికా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి చురుకైన సహకారం అందిస్తున్నది. దాని హోంల్యాండ్ సెక్యూరిటీ విధానంలో బలగాన్ని రెట్టింపు చేయడం కోసం ప్రభుత్వేతర శక్తులను (నాన్–స్టేట్ యాక్టర్స్‌ను) కూడా కలుపుకోవాలని స్పష్టంగానే వుంది. సల్వాజుడుం (దండకారణ్యం), సేంద్ర (ఝార్ఖండ్), శాంతిసేన/శాంతి సంఘం (ఒడిశా), నల్లదండు ముఠాలు (ఏ.పి.), హర్మద్ బాహిని/భైరవ్ బాహిని (పశ్చిమ బెంగాల్) వగైరా విప్లవ ప్రతిఘాతుక మిలీషియాల ఏర్పాటు వెనుక అమెరికా ప్రోద్బలం వుంది. సల్వాజుడుం రోజుల్లో అమెరికా కాన్సులేట్‌కు చెందిన ఆర్థిక, సైనిక నిపుణులు కాంకేర్‌లోని జంగల్ వార్‌ఫేర్ కాలేజ్‌ను పలు మార్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించడం ఇందుకు ఒక వుదాహరణ మాత్రమే.

ఫిబ్రవరి 2006లో అమెరికా కాన్సులేట్ జనరల్ మైకేల్ ఓవెన్ ఛత్తీస్‌గఢ్‌లో నాలుగు రోజుల పర్యటన జరిపాడు. ఆ సందర్భంగా అతడు

మీడియా వాళ్లతో మాట్లాడిన మాటల్ని గుర్తు చేసుకుంటే ఈ ప్రాంతంలో అమెరికా ప్రయోజనాలేమిటో, దాని దోపిడీ పథకాలేమిటో అర్థం చేసుకోవడం సులువవుతుంది. 2006 ఫిబ్రవరి 16న రాయ్‌పూర్ నుండి వెలువడే హిందీ దినపత్రిక 'జన్‌సత్తా' ఓవెన్ మాటలను ఇలా రాసింది – "…. ఛత్తీస్‌గఢ్‌లో ఆర్థికాభివృద్ధికి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడానికి ఎన్నో అవకాశాలున్నాయి. రాబోయే ఐదేళ్లలో ముఖ్యంగా ఖనిజాలు, విద్యుత్తు, పర్యాటక రంగాలలో అమెరికా పెట్టుబడులు పెట్టే అవకాశముంది. నక్సలైటు సమస్య విషయంలో… ఇక్కడ నెలకొన్న పరిస్థితుల గురించి సంబంధిత కంపెనీలకు మేం ముందుగానే అవగాహన కల్పిస్తాం…. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులు పెడితే ఇక్కడికి అమెరికా నుండి పెట్టుబడులను ఇంకా బాగా ఆకర్షించవచ్చు…" ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాలకు బాధ్యత వహించే మైకేల్ ఓవెన్ అప్పటి ఛత్తీస్‌గఢ్ గవర్నర్ కె.ఎం. సేఠ్ సహా స్థానిక వ్యాపారులతో, పారిశ్రామికవేత్తలతో, భారత పరిశ్రమల ఫెడరేషన్ అధికారులతో, ఇతర అధికారులతో మంతనాలు జరిపి వెళ్లాడు. కాటెర్‌పిల్లర్ (సి.ఏ.టి.) వంటి బడా అమెరికన్ కంపెనీలు మన దేశంలో మధ్య, తూర్పు భాగాల్లో ఖనిజాల్ని తవ్వి తీస్తున్న మైనింగ్ కంపెనీలకు భారీ యంత్ర పరికరాలెన్నో అమ్ముతున్నాయనేది గమనార్హం.

తిరిగి 2006 మే మూడో వారంలో ముంబాయిలోని అమెరికన్ కాన్సులేట్ అధికారులు విలియం ఇన్‌మెన్, కెవిన్ గ్రీన్‌లు రాయపూర్‌తో పాటు కాంకేర్‌లోని జంగల్ వార్‌ఫేర్ కాలేజ్‌ను పర్యటించి వెళ్లారు. ఆ సందర్భంగా అప్పటి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి (హోం) బి.కె.ఎస్. రే వాళ్లను కలిసి ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైటు వుద్యమాన్ని అణచివెయ్యడానికి అమెరికా సహాయం చేయాలని సిగ్గువిడిచి దేబిరించాడు. అపార ఖనిజ సంపదతో తులతూగే దండకారణ్యాన్ని దోచుకోవడానికి అమెరికా సామ్రాజ్యవాదులు ఎంతగా పరితపిస్తున్నారో, దానికి అడ్డంకిగా వున్న మావోయిస్టు వుద్యమాన్ని అణచివెయ్యడానికి వాళ్లెంత బరితెగించగలరో అర్థం చేసుకోవడానికి ఇవి కొన్ని వుదాహరణలు మాత్రమే.

అమెరికన్ గూఢచర్య సంస్థలైన ఎఫ్.బి.ఐ., సి.ఐ.ఏ. అధికారులు ఢిల్లీలో పాగా వేసి మావోయిస్టు వుద్యమ అణచివేత చర్యలకు, విప్లవోద్యమ అగ్రనేతలను భౌతికంగా నిర్మూలించడానికి మార్గదర్శకత్వం వహిస్తున్నారు. వాజ్‌పేయి ప్రభుత్వం ఇచ్చిన అనుమతితో ఢిల్లీలో 2000 నుండి ఎఫ్.బి.ఐ. అధికారికంగా తన కార్యాలయన్ని ప్రారంభించింది. అమెరికా ఈ యుద్ధంలో సైన్యానికి మార్గదర్శకత్వం వహించడమే కాదు, భారత్ గడ్డపై తమ ప్రత్యేక బలగాలు (స్పెషల్ ఫోర్సెస్) ప్రత్యక్షంగా కౌంటర్–ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్స్‌లో పాలు పంచుకుంటున్నాయని స్వయంగా పెంటగాన్ అధికారులే బాహాటంగా ప్రకటిస్తున్నారు. ఇటీవల 2012 మార్చ్ 15 నుండి పంజాబ్‌లోని భటిండాలో అమెరికన్ సాయుధ బలగాలు, భారత సాయుధ బలగాలతో కలిసి 15 రోజుల పాటు టెర్రరిస్టు వ్యతిరేక సంయుక్త అభ్యాసాల్లో పాల్గొన్నాయి. జాతీయ టెర్రరిస్టు వ్యతిరేక కేంద్రం (ఎన్.సి.టి.సి.)ని ఏర్పాటు చేయాలనే యు.పి.ఏ. ప్రభుత్వ నిర్ణయం వెనుక వున్నది కూడా అమెరికా సామ్రాజ్యవాదులే అనేది అందరికీ తెలిసిందే. **వీటన్నిటి ద్వారా భారతదేశంలో సాగుతున్న గ్రీన్‌హంట్ సహా కౌంటర్–ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్లన్నిటిలో అమెరికా జోక్యం ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. మావోయిస్టు వుద్యమాన్ని సమూలంగా అణచివెయ్యడం కోసం ప్రభుత్వాలు మన దేశ సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టి సామ్రాజ్యవాదుల కాళ్లపై ఎలా నిర్లజ్జగా సాగిలబడుతున్నాయో కూడా అర్థం చేసుకోవచ్చు.**

## ఎందుకీ యుద్ధం?

అసలు దోపిడీ పాలకులు దేశంలోని అణగారిన ప్రజలపై ఈ యుద్ధాన్ని ఎందుకు మొదలుపెట్టారు? మావోయిస్టు వుద్యమాన్ని దేశ అంతర్గత భద్రతకు అతి పెద్ద ప్రమాదంగా చిత్రీకరిస్తూ దాన్ని నిర్మూలించడానికి ఎందుకిన్ని పాట్లు పడుతున్నారు? ప్రస్తుతం బస్తర్‌లో సైన్యాన్ని దించాల్సిన అగత్యం ఏమొచ్చింది? అనేవి లోతుగా పరిశీలించాల్సిన విషయాలు.

భారతదేశం విశాల శ్రామిక జనాభాతో పాటు విలువైన ఖనిజ సంపదలకు నిలయం. ఇక్కడ దాదాపు 20 వేల రకాల ఖనిజాలు లభ్యమవుతాయని ఒక అంచనా. బొగ్గు, ఇనుము, క్రోమైట్, బాక్సైట్ వంటి కీలక ఖనిజాల లభ్యతలో మన దేశం ప్రపంచంలోనే అగ్రశ్రేణిలో నిలుస్తుంది. అనేక జీవనదులతో, పచ్చని అడవులతో విలసిల్లే మన దేశం దుర్భరమైన పేదరికంలో జీవించే కోట్లాది ప్రజలకు కూడా పుట్టినిల్లు. ఖనిజ సంపదల్ని కలిగి వున్న జిల్లాలే అత్యధిక అడవులు కలిగిన ప్రాంతాలుగా, అత్యధిక ఆదివాసీ జనాభా కలిగిన ప్రాంతాలుగా, పేదరికం, వెనుకబాటుతనం విలయ తాండవమాడే ప్రాంతాలుగా కూడా వుండడం ఒక చేదు వాస్తవం. 90 శాతం బొగ్గు, 80 శాతం ఇతర ఖనిజాలున్నది ఆదివాసీ ప్రాంతాల్లోనే. టయోటా, బోయింగ్ వంటి భారీ బహుళజాతి కంపెనీలు తాము వుత్పత్తి చేసే వాహనాలలో, విమానాలలో వాడేది, బీజింగ్ వంటి మహానగరాలలో ఆకాశహర్మ్యాల నిర్మాణంలో వాడుతున్నది మనదేశంలో తవ్వి తీసిన ఖనిజాలనే. మన దేశంలో ఇంకా ఒక ట్రిలియన్ డాలర్ల (50 లక్షల కోట్ల రూపాయల) విలువ చేసే ఖనిజ సంపద భూమి పొరల్లో నిక్షిప్తమై వుందని ఒక అంచనా.

మన దేశంలో ఖనిజ సంపదలకు నిలయంగా వున్న ప్రధాన రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్ ఒకటి. ఇక్కడ దాదాపు 28 రకాల ముఖ్యమైన ఖనిజాలు లభ్యమవుతాయి. వీటిలో ప్రధానమైనవి బొగ్గు, ఇనుము. దేశంలో లభ్యమయ్యే బొగ్గులో దాదాపు 16 శాతం, ఇనుప ఖనిజంలో దాదాపు 10 శాతం ఛత్తీస్‌గఢ్‌దే. బస్తర్ ప్రాంతంలోని బైలాడిల్లా కొండల్లో లభించే ఇనుము ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యత కలిగినది. బైలాడిల్లాలోని ఇనుప ఖనిజాన్ని భారత ప్రభుత్వ పబ్లిక్ రంగ సంస్థయైన ఎన్.ఎం.డి.సి. తవ్వి తీస్తున్నది. ఎన్.ఎం.డి.సి. దేశవ్యాప్తంగా ఉత్పత్తి చేసే మొత్తం ఇనుప ఖనిజంలో ఇది 80 శాతం వరకు వుంటుంది. బైలాడిల్లా నుండి ఇనుము ప్రధానంగా జపాన్‌కు ఎగుమతి అవుతుండగా, కొరియా, చైనా దేశాలకు కూడా కొంత మేరకు ఎగుమతి జరుగుతుంది. మొత్తం 1343 మిలియన్ టన్నుల నిల్వలతో ఛత్తీస్‌గఢ్‌లో మొదటి స్థానంలో నిలిచే బైలాడిల్లా కొండల్లో కొన్ని డిపాజిట్లను ప్రభుత్వం టాటా, ఎస్సార్ కంపెనీలకు లీజుకు ఇచ్చింది. ఇక్కడి నుండి ఖనిజాన్ని కొల్లగొట్టడానికి మరెన్నో కంపెనీల అర్జీలు ప్రభుత్వ పరిశీలనలో వున్నాయి.

ఖనిజ సంపదల లభ్యత రీత్యా ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ ప్రాంతానికి ప్రత్యేక స్థానం వుంది. ఇక్కడ ఇనుముతో పాటు తగరం, కోరండం, బాక్సైట్

వంటి అత్యంత విలువైన ఖనిజాలున్నాయి. బైలడిల్లా తర్వాత 732 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలతో రావ్‌ఘాట్ రెండో స్థానంలో వుంటుంది. నారాయణపూర్‌కు 29 కిలోమీటర్ల దూరంలోని రావ్‌ఘాట్ పర్వతాలు మాడ్ పర్వతాలను ఆనుకునే వుంటాయి. కాంకేర్ జిల్లాలోని బుధియారీమాడ్, కువ్వెమారిలలో అత్యంత విలువైన బాక్సైట్ ఖనిజం విస్తారంగా వుంది. కాగా ఇదే జిల్లాలోని కుదుర్‌వాహి గ్రామం దగ్గర 20 హెక్టేర్ల స్థలంలో 3 లక్షల టన్నుల బాక్సైట్ నిల్వలున్నాయని ఇటీవలే బైటపడింది.

దేశంలో 1990లలో ప్రపంచీకరణ పేరుతో నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 1991లో నూతన పారిశ్రామిక విధానాన్ని అమలులోకి తెచ్చారు. దీనికి కొనసాగింపుగా 1993లో ప్రవేశపెట్టిన నూతన మైనింగ్ విధానంలో భాగంగా అప్పటి వరకు సామ్రాజ్యవాదులు మన దేశ సహజ వనరుల్ని కొల్లగొట్టడానికి అడ్డంకిగా వున్న ఆంక్షలన్నిటినీ తొలగించి వేశారు. అప్పటి వరకు కేవలం పబ్లిక్ రంగం కోసమే రిజర్వ్ చేయబడిన వాటిలో కూడా విదేశీ, ప్రైవేటు పెట్టుబడుల ప్రవేశానికి తలుపులు బార్లా తెరిచారు. ఆ తర్వాతి కాలంలో మైనింగ్ రంగంలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతినిచ్చారు. పబ్లిక్ రంగంలోని అనేక మైనింగ్ పరిశ్రమల్ని, మైనింగ్ సంబంధిత పారిశ్రామిక కంపెనీలను ప్రైవేటుపరం చేశారు. దీంతో పాటే మైనింగ్‌పై ఆధారపడిన స్మెల్టింగ్ ప్లాంట్స్, స్పాంజ్ ఐరన్ ప్లాంట్స్, విద్యుత్ ప్లాంట్స్, డ్యాంలు, ఇతర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంబంధిత పరిశ్రమల ఏర్పాటు కోసం నిబంధనలను భారీగా సడలించారు. అనేక రాయితీలు ప్రకటించారు. విద్యుత్తు, నీరు తదితర సదుపాయాలు దాదాపు వుచితంగా అందించడానికి సిద్ధపడ్డారు. ఇలా మన దేశ సహజ వనరుల్ని విచ్చలవిడిగా కొల్లగొట్టడానికి విదేశీ పెట్టుబడికి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా ముఖ్యంగా ఇక్కడి ఆదివాసుల 'జల్-జంగల్-జమీన్'కు, వాళ్ల అస్తిత్వానికి అతి పెద్ద ముప్పు ఏర్పడింది.

అత్యధిక 'అభివృద్ధి' రేటుతో ప్రపంచ ఆర్థికవ్యవస్థల్లో రెండో స్థానానికి దూసుకెళ్లిన చైనాలో ఇనుముకు, స్టీలుకు డిమాండ్ పెరుగుతుండగా, అంతర్జాతీయ మార్కెట్లో ఖనిజాల ధరలు రికార్డు స్థాయిలో పెరిగిపోయాయి. అదే సమయంలో భారతదేశంలో ముడి పదార్థాల వెలికితీత ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. 1993-94లో 59 మిలియన్ మెట్రిక్ టన్నులు వుండిన ఇనుప ఖనిజం వుత్పత్తి 2005-06 నాటికి 154 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇదే కాలావధిలో బాక్సైట్ వుత్పత్తి 5 మిలియన్ టన్నుల నుండి 12 మిలియన్ టన్నులకు, బొగ్గు వుత్పత్తి 267 మిలియన్ టన్నుల నుండి 437 మిలియన్ టన్నులకు పెరిగింది. విదేశీ, దళారీ పెట్టుబడిదారులు ఖనిజాలను చేజిక్కించుకోవడం కోసం వెర్రిగా ఎగబడే క్రమం మొదలైంది.

అదే సమయంలో చిన్న, మధ్య రకం పెట్టుబడిదార్ల ప్రయోజనాలను ప్రభుత్వాలు దారుణంగా దెబ్బతీస్తున్నాయి. ఉదాహరణకు, ఏప్రిల్ 7, 2010న 'ఎకానమిక్ టైమ్స్'లో ప్రచురితమైన ఒక రిపోర్టు ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లో వున్న 105 స్పాంజ్ ఐరన్ పరిశ్రమల కోసం ఏటా 12 మిలియన్ టన్నుల ముడి ఇనుము అవసరం కాగా ఎన్.ఎం.డి.సి. వీటికి కేవలం 3 మిలియన్ టన్నులు మాత్రమే సరఫరా చేస్తున్నది. దీనితో వీటిలో అనేక కార్ఖానాలను మూసివేయాల్సి వచ్చింది.

దేశవ్యాప్తంగా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో వందలాది ఎం.ఎన్.సి.లు, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల కంపెనీలు రాబందుల్లా వాలుతున్నాయి. సెప్టెంబర్ 2009 వరకు మావోయిస్టు వుద్యమం సాగుతున్న రాష్ట్రాలలో 6,69,338 కోట్ల రూపాయల పెట్టుబడులకు సంబంధించిన ఎం.ఓ.యు.లపై సంతకాలు జరిగాయి. దేశం మొత్తంలో ఒప్పందం కుదుర్చుకున్న మొత్తం పెట్టుబడుల్లో ఇది 14 శాతం. టాటా స్టీల్, ఆర్సెలార్ మిత్తల్ (ఎం.టి.), డీ బీర్స్ కన్సాలిడేటెడ్ మైన్స్, బిహెచ్‌పి బిల్లిటన్ (బి.హెచ్.పి.), రియో టింటో (ఆర్.టి.పి.), ఎస్సార్ స్టీల్, జిందల్ స్టీల్, జైస్వాల్స్ నెకో లిమిటెడ్ వంటి ఎన్నెన్నో భారీ కంపెనీలతో ఈ ఎం.ఓ.యు.లు జరిగాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2006లో రమన్‌సింగ్ ప్రభుత్వం 50,000 కోట్ల రూపాయల ఎం.ఓ.యు.లు కుదుర్చుకుంది. తన తొలి మూడేళ్ల పాలనలో అది మొత్తం 1 లక్ష కోట్ల రూపాయల పెట్టుబడుల ఒప్పందాలు చేసుకుంది. మరీ ముఖ్యంగా 2008 ప్రారంభం నుండి తలెత్తిన ప్రపంచవ్యాప్త తీవ్ర ఆర్థిక సంక్షోభం నుండి బైటపడేందుకు సామ్రాజ్యవాదులు భారత్ వంటి వెనుకబడిన దేశాల్లోని ఖనిజ సంపదల్ని కారుచౌకగా చేజిక్కించుకోవడానికి తీవ్రంగా పోటీ పడుతున్నారు. ఇక్కడి దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లతో, భూస్వామ్యవర్గాలతో కుమ్మక్కయ్యి సహజ వనరుల్ని విచ్చలవిడిగా కొల్లగొట్టడానికి వేగిరపడుతున్నారు.

**ఖనిజాల్ని వెలికి తీయడం ఎంతగా పెరిగిందో ఆదివాసులను నిర్వాసితుల్ని చేయడం, అడవుల్ని నాశనం చేయడం కూడా అదే స్థాయిలో పెరిగిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.** ఒక అంచనా ప్రకారం 1947 నుండి ఇప్పటి వరకు మైనింగ్ ప్రాజెక్టుల, భారీ డ్యాంల ఫలితంగా దేశంలో 4 కోట్ల మంది నిర్వాసితులు కాగా వాళ్లలో నామమాత్రపు పునరావాసమైనా లభించింది కేవలం 25 శాతం మందికే. గత ఇరవై ఏళ్లలో మైనింగ్ ప్రాజెక్టుల కోసం 7 లక్షల 50 వేల ఎకరాల భూమిని, పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం 2 లక్షల 50 వేల ఎకరాల భూమిని 'అభివృద్ధి' పేరిట ప్రజల నుండి లాక్కుని కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టారు. **దేశ ప్రజలు కోల్పోయిన ఈ మొత్తం భూముల్లో 40 శాతం భూములు దేశ జనాభాలో 9 శాతంగా కూడా లేని ఆదివాసులవే. దీన్ని బట్టి దోపిడీ పాలకవర్గాలు నడుపుతున్న 'అభివృద్ధి' బుల్‌డోజర్ కింద నలిగిపోతున్న వాళ్లలో అత్యధికులు ఆదివాసులేనని స్పష్టమవుతుంది.**

**ఖనిజ సంపదలను కలిగి వున్న ప్రాంతాలన్నీ ఆదివాసీ బాహుళ్యం గల అటవీ ప్రాంతాలనేది ఎంత నిజమో, ఆదివాసీ బాహుళ్యం గల ప్రాంతాలన్నీ మావోయిస్టు వుద్యమం బలంగా వున్న, లేదా మావోయిస్టు వుద్యమ ప్రభావిత ప్రాంతాలనేది కూడా అంతే నిజం.** ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా సెజ్‌లకు, ఎంఎన్‌సీల భారీ ప్రాజెక్టులకు, భారీ డ్యాంలకు, గనుల లీజుకు, భూముల బలవంతపు స్వాధీనానికి వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు పెల్లుబుకుతున్నాయి. ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాలు ఈ పోరాటాలకు కేంద్రబిందువుగా మారాయి. ఇక్కడ 'జల్-జంగల్-జమీన్‌పై అధికారం ప్రజలదే' అనే నినాదం మారుమోగుతున్నది. 'పెట్టుబడి' దాడిని ఎదిరిస్తున్న ఆదివాసులకు మావోయిస్టు వుద్యమం అండగా వుండడమే కాకుండా, వాళ్ల ప్రతిఘటనకు అది నాయకత్వం వహిస్తున్నది. సరిగ్గా ఈ కారణం వల్లనే మావోయిస్టు వుద్యమం దేశ పాలకవర్గాల దృష్టిలో, వాళ్లకు దిశానిర్దేశనం చేస్తున్న సామ్రాజ్యవాదుల దృష్టిలో అతి పెద్ద ప్రమాదంగా మారింది.

## దండకారణ్యాన్ని కబళించ జూస్తున్న కార్పొరేట్ రాబందులు - ప్రతిఘటిస్తున్న ప్రజలు

దండకారణ్యం ఇనుము, బాక్సైట్, బంగారం, యురేనియం మొదలైన ఎన్నో విలువైన ఖనిజాలను సమృద్ధిగా కలిగి వున్న ప్రాంతం. ఇక్కడి గుట్టలలో ఏదో ఒక లోహం లేని మామూలు రాయి ఒక్కటి కూడా వుండదంటే అతిశయోక్తి కాదు. ఇక్కడి మట్టి ఎంతో సారవంతమైంది. సంవత్సరం పొడవునా పారే జీవనదులు, సెలయేళ్లు ఎన్నెన్నో. విలువైన వృక్ష జాతులు, ఔషధ మొక్కలతో నిండిన పచ్చని అటవీప్రాంతం ఇది. వీటితో పాటు మాడియా, మురియా, గోండ్, రాజగోండ్, భత్ర, ధుర్వ, ఉరాంవ్ మొదలైన ప్రాచీన ఆదివాసీ తెగలు, రావుత్, కలార్, మహార్, గాండో, మరార్, పన్కా తదితర ఆదివాసీయేతర కులాలకు చెందిన ప్రజలు ఇక్కడ తరతరాలుగా నివసిస్తున్నారు. భారత రాజ్యాంగం ప్రకారం వీళ్లను షెడ్యూల్డు తెగలుగా, కులాలుగా పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఏడు జిల్లాలుగా విడిపోయిన బస్తర్ ప్రాంతం రాజ్యాంగంలోని 5వ షెడ్యూలు కిందికి వస్తుంది. ఇక్కడ పెసా (పంచాయిత్‌రాజ్ షెడ్యూల్డు ప్రాంతాల విస్తరణ) చట్టం అమలులో వుంది. గ్రామసభలకు ప్రత్యేకాధికారాలున్నాయి. కాని ఇవన్నీ ఘోర వుల్లంఘనకు గురవుతున్నాయి. దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లు, బహుళజాతి కంపెనీలు స్థానిక ప్రజల ఆమోదం లేకుండానే ప్రభుత్వాలతో ఎన్నో ఎం.ఓ.యు.లు కుదుర్చుకున్నాయి. (దండకారణ్య ప్రాంతంలో ప్రతిపాదిత ఎం.ఓ.యు.లన్నీ అమలు చేయడం అంటే దాదాపు లక్ష ఎకరాల భూముల్ని రైతుల నుండి బలవంతంగా గుంజుకోవాల్సి వుంటుంది.) బూటకపు గ్రామసభల ద్వారా లేదా గ్రామసభలను ఏర్పాటు చేయకుండానే భూముల్ని ఆక్రమించుకుంటున్నారు. హీరానార్, నగర్నార్, లోహండిగూడ, ఖాంసీ గ్రామసభల అనుభవాలు ఇందుకు వుదాహరణలుగా నిలుస్తాయి.

2000లో ఎన్.ఎం.డి.సి. రష్యాకు చెందిన రోమెల్ట్ అనే బహుళజాతి కంపెనీతో కలిసి దంతెవాడ సమీపంలోని హీరానార్‌లో ఒక స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి పూనుకుంది. అయితే స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంది. తర్వాత ఆ ప్లాంట్ ప్రతిపాదనను 2001లో నగర్నార్‌కు తరలించారు. ఇది జగ్దల్‌పూర్ పట్టణానికి 14 కిలోమీటర్ల దూరంలో వుంటుంది. 300 ఎకరాల భూమిని ఆక్రమించుకొని 250 మందికి వుద్యోగాలిస్తామని ఆశ చూపారు. ప్రజలు లొంగలేదు. ప్రతిఘటించారు. అధికారులు పోలీసులతో కలిసి గ్రామసభను నిర్వహించాలని గ్రామానికి వస్తే వాళ్లను తన్ని తరిమేశారు. గ్రామసభను బహిష్కరించారు. పోలీసులు గ్రామంలో అడ్డా వేసి ప్రజలపై విరుచుకుపడ్డారు. పసిపిల్లల నుండి ముసలి వాళ్ల వరకు ఎంతో మందిని హింసించారు. పరీక్షలు రాస్తున్న స్కూలు పిల్లల్ని సైతం అరెస్టు చేసి జైలు పాలు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మరోసారి గ్రామసభ ఏర్పాటుకు ప్రయత్నించింది. ప్రజల పోరాటానికి మద్దతు ప్రకటించి, తాము కూడా గ్రామసభను ప్రత్యక్షంగా పరిశీలిస్తామని ముందుకు వచ్చిన బి.డి. శర్మ, వందనా శివ వంటి ప్రజాస్వామికవాదులను ఆనాటి బి.జె.పి. ఎం.పి. బలిరాం కశ్యప్ నాయకత్వంలో కాంగ్రెస్, బి.జె.పి.లకు చెందిన గూండాలు, పోలీసులు దారికాచి కొట్టి వెనక్కి పంపించారు. చివరకు ఫాసిస్టు అణచివేత ద్వారా పాలకులు ప్రజలను అదుపు చేసి భూముల్ని గుంజుకున్నారు. గుంజుకున్న భూముల చుట్టూ ప్రహరీ గోడను కూడా నిర్మించారు. ఇప్పటికి పదేళ్లు గడిచిపోయింది. హామీ ఇచ్చిన విధంగా కనీస నష్టపరిహారం చాలా మందికి ఇంకా అందలేదు. స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన మినహా నిర్మాణం జరగనే లేదు కాబట్టి భూములు కోల్పోయిన వాళ్లకు వుద్యోగాలు లభించడమనే ప్రశ్నే తలెత్తదు. భూములూ కోల్పోయి, ఉపాధీ దొరకక ఎందరో నగర్నార్ వాసులు నిర్వాసితులుగా మారి చెట్టుకొకరు పుట్టకొకరుగా చెదిరిపోయారు.

2005లో, సరిగ్గా సల్వాజుడుం మొదలైన రోజుల్లోనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం టాటా, ఎస్సార్, టెక్సాస్ పవర్ జెనరేషన్ (అమెరికన్ కంపెనీ)లతో రహస్య ఎం.ఓ.యు.లు కుదుర్చుకుంది. 2006లో వివిధ కార్పొరేట్ సంస్థలతో మరో 35 ఎం.ఓ.యు.లను కుదుర్చుకుంది. ఈ ఎం.ఓ.యు.లలో ఏమున్నదో రమన్‌సింగ్ ప్రభుత్వం ప్రజలకు ఎలాగూ చెప్పలేదు. వాటిలో ఏముందో వెల్లడి చేయాలని విధానసభలో ప్రశ్నించిన తన స్వంత పార్టీకి చెందిన లచ్చూ కశ్యప్ అనే ఆనాటి ఎం.ఎల్.ఏ.కు జవాబు చెప్పకుండా నోరు మూయించిన ఘనత కూడా రమన్‌సింగ్‌కే దక్కుతుంది! ప్రభుత్వాలు చెప్పే సమాచార హక్కు, పారదర్శకత వంటి మాటలు ఎంత బూటకమో అర్థం చేసుకోవడానికి ఇంతకన్నా వేరే వుదాహరణ ఏం కావాలి? అయితే గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ మార్చ్ 2009లో తయారు చేసిన ఒక డ్రాఫ్ట్ రిపోర్ట్‌లో సల్వాజుడుంకు తొలి ఫైనాన్షియర్లు టాటా, ఎస్సార్‌లేనని ఎలాంటి దాపరికం లేకుండా స్పష్టంగానే పేర్కొన్నది. అంతేకాదు, సల్వాజుడుం సాగించిన బీభత్సకాండ వల్ల ఖాళీ అయిన 644 గ్రామాలను ఆక్రమించుకోవడానికి అవి ఆత్రుతగా వున్నాయని కూడా ఆ రిపోర్టు పేర్కొంది.

టాటా స్టీల్ బస్తర్ జిల్లాకు చెందిన లోహండిగూడ సమీపంలో 10,000 కోట్ల రూపాయల పెట్టుబడితో 5 మిలియన్ టన్నుల వార్షిక వుత్పత్తి సామర్థ్యం గల స్టీల్‌ప్లాంట్ నిర్మాణం తలపెట్టింది. దీని కోసం దాదాపు 5360 ఎకరాల విలువైన భూముల్ని రైతుల నుండి స్వాధీనం చేసుకోవాలని అనుకుంటున్నది. ఇది జరిగితే దాదాపు 10 గ్రామాల ఉనికి తక్షణమే లేకుండా పోతుంది. క్రమంగా మరో పాతిక గ్రామాలు విధ్వంసానికి గురవుతాయి. రెండు పంటలు పండే తమ సారవంతమైన భూముల్ని ససేమిరా ఇచ్చేది లేదని ఈ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా ఆదివాసులు పోరాటం ప్రారంభించారు. రెండు సార్లు జరిగిన గ్రామసభల్లో ప్రజలు వత్తిళ్లకు తల వంచకుండా భూముల్ని ఇవ్వబోమని తీర్మానం చేశారు. కాని కలెక్టర్, పోలీసు అధికారులు, టాటా దళారులు, టాటా మేనేజ్‌మెంట్ కుమ్మక్కయ్యి గ్రామాల్లో కాకుండా జగ్దల్‌పూర్ పట్టణంలో పోలీసుల పహారాలో గ్రామసభ నిర్వహించి 'ఆమోదం' పొందినట్టు తీర్మానం చేసుకున్నారు. తెల్లబట్టల పోలీసులూ, టాటా గూండాలే ఈ బూటకపు గ్రామసభలో గ్రామస్తుల్లా కూర్చొని వేలిముద్రలు వేసి 'ఆమోదం' తెలిపారు. ఈ పోరాటానికి మొదట్లో సి.పి.ఐ. నాయకత్వం వహించినప్పటికీ తర్వాతి రోజుల్లో అది క్రమంగా ఎక్కువ నష్టపరిహారానికి భూముల్ని అప్పగించవచ్చనే రాజీవాద వైఖరి తీసుకొని ప్రజల వ్యతిరేకతకు గురయ్యింది. ఇప్పుడు టాటా యాజమాన్యం తమ దళారుల ద్వారా అనేక కుట్రలకు, కుయుక్తులకు పాల్పడుతూ ప్రజల్లో చీలిక తేవడం కోసం ప్రయత్నిస్తున్నది. సి.ఎస్.ఆర్. (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) కింద అనేక బూటకపు సంస్కరణ కార్యక్రమాలను నడుపుతున్నది. కాని ప్రజలు పోలీసు నిర్బంధాల్ని ఎదుర్కొంటూ, దళారుల కుట్రలను ఓడిస్తూ టాటాను తమ భూముల్లో అడుగు పెట్టనివ్వబోమంటూ రాజీ లేకుండా పోరాడుతున్నారు.

ధుర్లిదీ ఇదే అనుభవం. ప్రపంచవ్యాప్తంగా ఒక లక్ష కోట్ల రూపాయల టర్నోవర్ కలిగిన బడా దళారీ కంపెనీ ఎస్సార్ ధుర్లీ, భాంసీ, కమాలూర్ సహా మొత్తం నాలుగు గ్రామాల ప్రజల నుండి 1483 ఎకరాల భూముల్ని లాక్కుని 7,000 కోట్ల రూపాయలతో 3.2 మిలియన్ టన్నుల ఉత్పాదక సామర్థ్యంతో ఒక స్టీల్‌ప్లాంట్ నిర్మాణం చెయ్యాలని అనుకుంది. కాని స్థానిక ప్రజలు తమ భూముల్ని ఇవ్వడానికి సిద్ధంగా లేరు. సల్వాజుడుంను నడిపించడంలో ప్రధాన పాత్ర పోషించిన అప్పటి దంతెవాడ కలెక్టర్ కె.ఆర్. పిస్దా, కాంగ్రెస్‌కు చెందిన సల్వాజుడుం ముఖ్య నేత మహేంద్ర కర్మ, బి.జె.పి.కి చెందిన అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి కేదార్ కశ్యప్ (బలిరాం కశ్యప్ కొడుకు) 2006 ఆగస్టు 30న స్వయంగా పోలీసులతో, గూండాలతో ఈ గ్రామాలకు వచ్చి తుపాకులు గురిపెట్టి ప్రజల్ని బెదిరించి 'గ్రామసభ'ను నిర్వహించారు. గ్రామసభలో బైటి వాళ్లెవరూ పాల్గొనగూడదనే నిబంధనను తుంగలో తొక్కుతూ 'ఆమోదం' తెలిపే తీర్మానంపై సంతకాలు చేసేలా ప్రజలను వత్తిడి చేశారు. అయినప్పటికీ ప్రజలు లొంగకపోవడంతో ఆరేళ్లు గడిచిపోయినా ఇక్కడ స్టీల్‌ప్లాంట్ కోసం భూముల్ని స్వాధీనం చేసుకోలేకపోయారు.

ఇదే ఎస్సార్ కంపెనీ 2002 నుండి బస్తర్ జల వనరుల్ని పెద్ద ఎత్తున దోచుకుపోతున్నది. బైలడిల్లా గనుల నుండి ఏటా 8 మిలియన్ టన్నుల ఇనుప చూర్ణాన్ని అది విశాఖపట్నం వరకు 267 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా తరలిస్తున్నది. దీని కోసం అది పెద్ద ఎత్తున నీటిని దుర్వినియోగం చేస్తున్నది. తన ట్రాన్స్‌పోర్ట్ ఖర్చుల్ని తగ్గించుకోవడం కోసం శంఖిని, డంకిని, శబరి నదుల నీటిని వృధాగా బంగాళాఖాతంలోకి ప్రవహింపజేస్తున్నది. దీనితో ఈ చుట్టు పక్కల చాలా గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొనడమే కాకుండా మొత్తంగానే భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. పైప్‌లైన్ ద్వారా నీటి వత్తిడితో ఇనుమును తరలించడం ద్వారా ఈ బడా కంపెనీకి ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు టన్నుకు 330 రూపాయల నుండి 80 రూపాయలకు తగ్గింది. దీని వల్ల రైల్వేకు జరిగే భారీ నష్టాన్ని అటుంచినా, బస్తర్ ప్రజల ఆకలిదప్పుల్ని తీర్చే విలువైన జల సంపదను కొల్లగొట్టడాన్ని ప్రభుత్వం ఎందుకు అనుమతించినట్టు? ఎందుకంటే దానికి ఇక్కడి ఆదివాసుల బతుకుల కంటే కార్పొరేట్ వర్గాల లాభాలే ముఖ్యం కాబట్టి.

ఈ పైప్‌లైన్‌ను అడ్డుకోవడానికి మావోయిస్టుల నాయకత్వంలో ప్రజలు అనేక మార్లు ప్రయత్నించి దాన్ని దెబ్బతీసినప్పటికీ అది పోలీసుల సహాయంతో తిరిగి నిర్మించుకుంటూనే వున్నది. ఈ మధ్యన మావోయిస్టులకు ఎస్సార్ కంపెనీ నుండి డబ్బులు ముడుతున్నాయనే దుష్ప్రచారం చేస్తూ పోలీసులు కొందరు ఆదివాసులను మావోయిస్టుల మధ్యవర్తులుగా చిత్రించి అరెస్టు చేశారు. వాళ్లను తీవ్రమైన చిత్రహింసల పాల్జేసి తప్పుడు కేసుల్లో ఇరికించారు. ఒకవేళ ఈ ఆరోపణ నిజమే అయితే గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖనే స్వయంగా భూసంబంధాలపై తన ముసాయిదా రిపోర్టులో పేర్కొన్నట్టుగా ఎస్సార్‌కు టాటాతో కలిసి సల్వాజుడుంను స్పాన్సర్ చేసే అవసరం ఏమిటి? మావోయిస్టుల నుండి దానికి 'రక్షణ' వుంటే గ్రామాల్ని ఖాళీ చేసి ప్రజలను రోడ్ల మీదున్న నిర్బంధ శిబిరాలకు తరలించే పథకం కోసం ఎస్సార్ కంపెనీకి ఫండింగ్ చేయాల్సిన అవసరం ఏమిటి? ఈ ఆరోపణ నిజమని ప్రభుత్వం నిజంగానే నమ్మితే అమాయక ఆదివాసుల్ని బలిపశువుల్ని చేసే బదులు ఆ అవినీతికర కంపెనీని, దాని పైప్‌లైన్‌ను ఇక్కడ నుండి పూర్తిగానే వెళ్లగొట్టవచ్చు కదా! ఇది మావోయిస్టు వుద్యమంపై బురద జల్లే హేయమైన ఎత్తుగడే తప్ప నిజానిజాలేమిటో, కార్పొరేట్ కంపెనీల దోపిడీ విధానాల పట్ల మావోయిస్టుల వైఖరి ఏమిటో ప్రజలకే కాదు, ప్రభుత్వాలకు కూడా స్పష్టంగానే తెలుసు. ఈ ఆరోపణను అటుంచి, ఎస్సార్ పైప్‌లైన్‌ను నడవకుండా చేసి బస్తర్ జల సంపదల్ని కాపాడుకోవడానికి ప్రజలు, వాళ్లకు నాయకత్వం వహిస్తున్న మావోయిస్టులు ఇప్పటికీ పోరాడుతూనే వున్నారు.

ఇంద్రావతి నదిపై ప్రభుత్వం తలపెట్టిన బోధ్‌ఘాట్ డ్యాంతో 32 పంచాయితీలు మునిగిపోతాయి. దాదాపు 70-80 వేల మంది ప్రజలు నిర్వాసితులవుతారు. 'బస్తర్ నయాగరా'గా ప్రఖ్యాతి గాంచిన చిత్రకోట్ జలపాతం పూర్తిగానే మునిగిపోతుంది. 500 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టు ఇక్కడికి తరలి వస్తున్న పెట్టుబడుల సేవకే తప్ప స్థానిక ప్రజలకు కాదు. నిజానికి ఇది 1971 నాటి పథకం. ప్రజల నిరసన, ప్రతిఘటనల కారణంగా ఇంత కాలం నిల్చిపోయిన ఈ ప్రాజెక్టును తిరిగి ఎలాగైనా ప్రారంభించాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. 2010 చివర్లో జిందల్ కంపెనీ కూడా సర్వే పేరుతో రంగంలోకి దిగింది. అయితే ప్రజలు తమ పూర్వీకుల పోరాట సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ 'జాన్ జావ్ జీవ్ జావ్, బోధ్‌ఘాట్ కాజె లడ్‌వా' (ప్రాణాలు పోతే పోనీ గాని బోధ్‌ఘాట్ కోసం పోరాడుతాం) అని నినదిస్తూ ప్రతిఘటనను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం పోలీసు, అర్ధసైనిక బలగాలతో నిర్బంధాన్ని ప్రయోగిస్తూ ఈ ప్రజా వుద్యమానికి నాయకత్వం వహిస్తున్న వాళ్లను కటకటాల వెనక్కి తోస్తున్నది.

బస్తర్ ప్రజల జీవన్మరణ పోరాటాల్లో మరొకటి రావ్‌ఘాట్‌ను రక్షించుకునేందుకు సాగుతున్న పోరాటం. మొట్టమొదట 1899లో ఈ పర్వత ప్రాంతంలో ఇనుప ఖనిజ నిల్వలున్నట్టు కనుగొన్నారు. 1949లో భారత భూ పరిశోధనా సంస్థ దీన్ని సర్వే చేసింది. 731 మిలియన్ టన్నుల నిల్వలున్న ఈ పర్వతాలను తవ్వి ఇనుమును తీయడానికి సెయిల్ (స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్) 1983 నుండి ప్రయత్నాలు సాగిస్తున్నది. దీని ద్వారా ఇక్కడి 23 గ్రామాల అస్తిత్వం ప్రమాదంలో పడడంతో పాటు నీటి వనరులకు, అడవులకు, పంట పొలాలకు, మొత్తంగా పర్యావరణానికి భారీ నష్టం జరుగుతుంది. అయినా 1996లో పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇచ్చింది. అయితే ప్రజల ప్రతిఘటన మూలంగా ఇది ఆగిపోయింది. 1992 నుండే ఈ ప్రాంత ప్రజలు గనుల తవ్వకం ప్రతిపాదనకు వ్యతిరేకంగా వుద్యమిస్తున్నారు. 1992లో పది వేల మంది ఆదివాసులు కదిలి అంతాగఢ్ పట్టణంలో పెద్ద ఊరేగింపు తీశారు. దీంతో మధ్యలో ఆగిపోయిన ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి 2007 నుండి మళ్లీ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

అయితే రావ్‌ఘాట్ గనుల్ని తెరవకపోయినట్టయితే ప్రభుత్వ రంగ సంస్థయైన సెయిల్‌కు చెందిన భిలాయ్ స్టీల్‌ప్లాంట్ మూతపడే ప్రమాదం వుందని, తద్వారా వేలాది కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకం కానున్నదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం ముడి ఇనుమును అందిస్తున్న దల్లీరాజహరా గనులు త్వరలోనే వట్టిపోతాయని చెబుతున్నారు. ఇదంతా బూటకపు ప్రచారమేనని, నిజానికి సెయిల్ కేవలం ముసుగు మాత్రమేనని, దీని మాటున ఇక్కడ దిగనున్న అసలైన బడా కిలాడీలు టాటా, ఎస్సార్, జయస్వాల్స్ నెకో, మిత్తల్, జిందల్‌లేనని ప్రజలు స్పష్టంగానే అర్థం చేసుకున్నారు. ఈ గనుల కోసం నిర్మిస్తున్న దల్లీ-రావ్‌ఘాట్-జగ్దల్‌పూర్ రైల్వేలైన్‌ను 'బస్తర్ అభివృద్ధికి రాచబాట'గా

ప్రచారం చేయడం కూడా అంతే బూటకమని వేరే చెప్పవలసిన అవసరం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం బలవంతంగా ఈ గనుల్ని తెరవడానికి ఐదు వేల బి.ఎస్.ఎఫ్. బలగాల్ని ప్రత్యేకంగా తెప్పిస్తున్నది. మరోవైపు భిలాయ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విడిగానే ఒక బెటాలియన్ (800 నుండి 1000 మందితో) సాయుధ బలగాన్ని తయారు చేసుకుంటున్నట్టు ప్రకటించింది. అంటే తుపాకీ సన్నీలతో ఆదివాసుల్ని తరిమేసి, అడవుల్ని నరికేసి గనులు తెరవడానికి రంగం సిద్ధమైందనేది స్పష్టం. ప్రజలు మాత్రం ఎలాంటి వత్తిళ్లకు తలొగ్గకుండా ఎదిరించి పోరాడుతున్నారు.

రావ్‌ఘాట్‌కు దగ్గర్లో వున్న చార్‌గాంలో 21.8 మిలియన్ టన్నులు, దాని పక్కనే వున్న మెట్టబోదిలిలో 15.6 మిలియన్ టన్నులు, హహలాదిలో 12.8 మిలియన్ టన్నుల ముడి ఇనుము నిల్వలున్నాయి. వీటిని జయస్వాల్స్ నెకో, ప్రకాశ్ ఇండస్ట్రీస్, వందనా ఎనర్జీ, ఆగ్రో సినెర్జీ, కుసుం మినరల్స్, మోనెట్ ఇస్పాత్ తదితర అనేక మైనింగ్ కంపెనీలకు ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. ఈ కంపెనీలన్నీ ప్రజల్ని మాయమాటలతో మోసం చేస్తూ మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలని 2004 నుండే తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అయితే స్థానిక ప్రజలు సంఘటితమై తమ వినాశనానికి దారులు తెరిచే ఈ పథకాల్ని అమలు కానివ్వకుండా అడ్డుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ ప్రాంతాన్నంతా కార్పెట్ సెక్యూరిటీ కిందికి తెచ్చి బి.ఎస్.ఎఫ్. బలగాలతో పాశవిక నిర్బంధాన్ని అమలు చేస్తున్నది. ప్రతి 5-7 కిలోమీటర్లకు ఒకటి చొప్పున క్యాంపుల్ని ఏర్పాటు చేసింది. వందల, వేల సంఖ్యలో సాయుధ బలగాలు గ్రామాలపై పడి భయ బీభత్సాల్ని సృష్టిస్తున్నాయి.

మాడ్ పర్వతాల నడి మధ్యన వుండే ఛోటాడోంగర్ (ఆమ్‌దాయిమెట్ట) ప్రాంతంలో 35.3 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలున్నట్టు అంచనా. ఇక్కడ జయస్వాల్స్ నెకో లిమిటెడ్ అనే కంపెనీ గనులను తవ్వాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. 2010 మధ్యలో ఈ కంపెనీ ప్రజల అనుమతి లేకుండానే, కొందరు దళారుల మద్దతుతో పెద్ద ఎత్తున చెట్లను నరికి తవ్వకాల్ని ప్రారంభించాలని చూడగా ప్రజలు పెద్ద ఎత్తున కదిలి కంపెనీ అధికారులను, అటవీశాఖ అధికారులను, దళారులను తన్ని తరిమేసారు. అప్పటి నుండి అటు వైపు అడుగుపెట్టడానికి వాళ్లకు ధైర్యం చాలడం లేదు. అయితే ఈ ప్రాంతంలో కూడా కార్పెట్ సెక్యూరిటీతో వుచ్చు బిగిస్తున్నారనేది గమనార్హం.

రాజ్‌నాంద్‌గాం జిల్లాలోని మాన్‌పూర్ ప్రాంతంలోని ఖడ్‌గాం, బోరియా టిబ్బు, రోసెలి తదితర గ్రామాలను ఆనుకొని వున్న కొండల్లో పదుల మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలున్నాయి. ఇక్కడ రాయపూర్ ఎల్లాయ్స్, గోదావరి ఇస్పాత్, జయస్వాల్స్ నెకో, వందనా గ్లోబల్ తదితర కార్పొరేట్ కంపెనీలు మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రాంతంలో పల్లామాడ్ గనుల్ని ప్రారంభించిన రాయ్‌పూర్ ఎల్లాయ్స్‌కు వ్యతిరేకంగా ప్రజలు సమరశీల పోరాటానికి దిగారు. 2008 జనవరిలో వెయ్యి మందికి పైగా ప్రజలు, కార్మికులు కదిలి ఈ గనిని మూసేశారు. కాని కొంత కాలానికి మళ్లీ మేనేజ్‌మెంట్ పనిని ప్రారంభించింది. తిరిగి డిసెంబర్ నెలలో మరోసారి పెద్ద ఎత్తున ప్రజలు కదిలి గనిని మూసెయ్యడంతో పాటు మిషన్లను, వాహనాలను అక్కడి నుండి వెనక్కి పంపించేసారు. ఇక్కడి పంటపొలాలకు, అడవులకు, మొత్తంగా ప్రజా జీవనానికి వినాశకరంగా పరిణమించిన ఈ గనిని, ఇంకా ప్రతిపాదిత గనుల ప్రాజెక్టులన్నిటినీ ప్రజలు వ్యతిరేకిస్తూ వుద్యమిస్తున్నారు.

ఇదే ప్రాంతంలోని ఔంధి, మొహల గ్రామాల పరిసరాల్లో భారీ యురేనియం నిల్వలు వున్నాయని తాజాగా రిపోర్టులు వెలువడుతున్నాయి. వీటిని తవ్వి తీయడానికి ప్రయత్నాలు మొదలవుతున్నాయి. ఇలా ఈ ప్రాంతం మొత్తంగానే భారీ వినాశనం అంచులకు చేరుకుంటున్నది. అయితే ప్రజలు దీనికి వ్యతిరేకంగా వుద్యమిస్తున్నారు. ఈ వుద్యమాలను అణచివేసి కార్పొరేట్ సంస్థలకు ఇక్కడి ఖనిజ సంపదను విచ్చలవిడిగా దోచుకునే వీలు కల్పించడం కోసం ప్రభుత్వం వేల సంఖ్యలో ఐ.టి.బి.పి. బలగాలను దించి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. కార్పొరేట్ వర్గాల సేవకు అంకితమైన ప్రభుత్వాలు కార్పెట్ సెక్యూరిటీతో ప్రజల్ని అణచెయ్యాలని చూస్తున్నాయి. అయితే ప్రజలు మాత్రం ఈ కార్పొరేట్ దాడికి వ్యతిరేకంగా బరిగీసి నిలబడ్డారు.

ఇంకా ఇదే ప్రాంత సరిహద్దులో వుండే ఆరిడోంగ్రి, కచ్చె, చార్‌గాం (కాంకేర్ జిల్లా) గనులకు వ్యతిరేకంగా కూడా ప్రజలు వుద్యమిస్తున్నారు. ప్రజా వుద్యమాల మూలంగా అనేక మైనింగ్ సంస్థలు, మైనింగ్ మాఫియా తోక ముడవక తప్పలేదు.

కేస్కల్ ప్రాంతంలోని బుధియారీమాడ్, కువ్వెమారి ప్రాంతాల్లో విలువైన బాక్సైట్ నిల్వలున్నాయి. వీటిని కొల్లగొట్టడం కోసం మైనింగ్ పనులు ప్రారంభించగా 1990ల ప్రారంభంలోనే ప్రజలు ప్రతిఘటనా పోరాటాలకు పూనుకున్నారు. వేల సంఖ్యలో సంఘటితమైన ప్రజలు అనేక ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించారు. అప్పటి మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ఎన్నో అర్జీలు పెట్టుకున్నారు. చివరగా, మొండివైఖరిని ప్రదర్శించిన మైనింగ్ సంస్థల అధికారుల్ని తన్ని తరిమేసిన తర్వాత ప్రజలు విజయం సాధించారు. ఇటీవల కుదుర్‌వాహి ప్రాంతంలో పెద్ద ఎత్తున బాక్సైట్ నిల్వలున్నట్టు కనుగొన్నారు. దేశ హోంమంత్రి చిదంబరం ఒకప్పుడు వకీలుగా పని చేసిన, కొంత కాలం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో సభ్యుడిగా కొనసాగిన కుఖ్యాత వేదాంత కంపెనీ ఈ ప్రాంతంపై ప్రత్యేకంగా కన్నేసి వుంది. చిదంబరం ఈ యుద్ధానికి ఎందుకింత త్వరపడుతున్నాడో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. రాయ్‌పూర్ నగరం నుండి జగ్దల్‌పూర్ వైపు మలుపు తిరిగే రోడ్డు నిండా వున్న వేదాంత కంపెనీ హోర్డింగ్‌లు వుత్త ప్రదర్శన కోసమే కాదని అర్థం చేసుకోలేనంత అమాయకులు కాదు ఇక్కడి ఆదివాసులు!

మరోవైపు దండకారణ్యంలో భాగమైన మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో వున్న సూర్జాగఢ్ గుట్టలపై ఇనుప గనుల్ని తెరిచి అక్కడి 'జల్-జంగల్-జమీన్'ను వినాశనం చెయ్యడానికి అనేక కంపెనీలు పొంచి వున్నాయి. ఇంకా బేసెవాడ, ధమ్‌కోండ్‌వాడీ, ఝుండేపార్, బాండే, గుండూజుర్ మోహందీ, మసేలీ, పుర్‌హుర్‌మెట్ట, కోరెపల్లి తదితర చోట్లలో వున్న అనేక ఖనిజాల్ని వెలికి తీసేందుకు ఎన్నో కంపెనీలతో మహారాష్ట్ర ప్రభుత్వం ఎం.వో.యు.లు చేసుకుంది. ఇటీవల గడ్చిరోలి జిల్లాలో 12 చోట్లలో ప్రజల నుండి ఎదురవుతున్న ప్రతిఘటన, నిరసనల మూలంగా గనుల్ని తెరవలేకపోతున్నామని కొన్ని కార్పొరేట్ సంస్థలు వాపోయాయి. దీన్ని బట్టి ఎస్సార్, లాయిడ్, సూర్జాగఢ్ స్టీల్ ఎండ్ మైన్స్ లిమిటెడ్, వీరాంగనా స్టీల్ లిమిటెడ్, గోపానీ ఐరన్ తదితర కార్పొరేట్ కంపెనీలు గడ్చిరోలి జిల్లాలోని సంపదల్ని నిట్టనిలువుగా దోచుకునే అవకాశాల కోసం ఎంతగా ఎదురుచూస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

బైలాడిల్లా నుండి ఇనుప ఖనిజాన్ని కారుచౌకగా అమ్ముతున్న ప్రజావ్యతిరేక, దేశద్రోహ విధానాల పట్ల కూడా ప్రజల నుండి తీవ్ర

ప్రతిఘటన ఎదురవుతున్నది. ఇనుప ఖనిజం ధర ఓపెన్ మార్కెట్లో టన్నుకు 5800 రూపాయలు, అంతర్జాతీయ మార్కెట్‌లో 10 వేల రూపాయల దాకా వుండగా, ఎన్.ఎం.డి.సి. ప్రపంచంలోనే అత్యుత్తమ నాణ్యత గల ఇనుమును జపాన్‌కు కారుచౌకగా 160 రూపాయలకు అమ్ముతున్నది. దీనితో జపాన్‌కు టన్నుకు కేవలం 400 రూపాయల ఖర్చుతో ఇనుప ఖనిజం గుట్టలు గుట్టలుగా చేరుతున్నది. దీనిపై ప్రభుత్వానికి లభిస్తున్న రాయల్టీ టన్నుకు 50 రూపాయల లోపే. నిలువుదోపిడీకి, దేశద్రోహానికి ఇంతకన్నా వేరే వుదాహరణ వుంటుందా? మరోవైపు బైలడిల్లా కొండల్లోని మిగిలిన డిపాజిట్లను చాటుమాటుగా టాటా, ఎస్సార్, జిందల్, మిత్తల్ వంటి కార్పొరేట్ సంస్థలకు తెగనమ్మివేస్తున్నారు. దీన్ని అడ్డుకోవడానికి ప్రజలు పోరాడుతున్నారు.

ఒక్క మాటలో చెప్పాలంటే దోపిడీ పాలకులు 'అభివృద్ధి' మంత్రం జపిస్తూ, కార్పొరేట్ వర్గాలకు సూపర్ లాభాలు చేకూర్చే లక్ష్యంతో, అమలు చేయాలని చూస్తున్న అత్యంత వినాశకర విధానాలకు దండకారణ్యంలో అడుగడుగునా ప్రజల నుండి ప్రతిఘటన ఎదురవుతున్నది. బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర సహా దేశంలోని ఇతర అనేక ప్రాంతాల్లోనూ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతిఘటనకు నాయకత్వం వహిస్తున్న వాళ్లలో అగ్రగామిగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నిలిచింది. దీన్ని అణచడం కోసం సైన్యాన్ని దించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక తక్షణ కారణం ఇదే.

## పాలకులను కలవరపరుస్తున్న ప్రజల ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా

దండకారణ్యంలో సైన్యాన్ని దించిన నేపథ్యానికి ముఖ్యమైన పార్శ్వం ఇక్కడ ఎదుగుతున్న విప్లవ ప్రజా ప్రభుత్వం లేదా 'విప్లవ ప్రజా కమిటీ'. స్థానిక ప్రజల భాషలో 'క్రాంతికారీ జనతన సర్కార్'. గత 30 ఏళ్లుగా సాగుతున్న వర్గపోరాటం ఫలితంగా ప్రజలు సాధించిన ముఖ్యమైన విజయాల్లో ఒకటి ఇక్కడ గ్రామ, ఏరియా స్థాయిల్లో ప్రజల ప్రజాస్వామిక అధికార అంగాల ఏర్పాటు. వర్గ పోరాటాల ద్వారా గ్రామాల్లో భూస్వామ్య శక్తుల, తెగ పెత్తందార్ల అధికారాన్ని దెబ్బతీసి, బూటకపు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని తిరస్కరించి కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై జరుగుతున్న పీడిత వర్గాల ప్రజాస్వామిక అధికార అంగాల ఏర్పాటు దాదాపు గత పదిహేనేళ్లుగా సాగుతున్నది. ఇంతకాలం అధికారానికి దూరంగా వుంచబడిన పీడిత ప్రజలు, పీడిత సెక్షన్లు, ముఖ్యంగా మహిళలు నేడు ప్రజల ప్రజాస్వామిక అంగాల్లో చురుకైన భాగస్వామ్యం వహిస్తున్నారు.

గత ముప్పయ్యేళ్లుగా సాగుతున్న విప్లవోద్యమం ఫలితంగా దండకారణ్యంలో భూములు లేని రైతులెవరూ లేకపోవడం మరొక ముఖ్యమైన విజయం. 'క్రాంతికారీ జనతన సర్కార్' చాలా చోట్లలో భూస్వాముల భూములను, మిగులు భూములను, అటవీ భూములను భూమి లేని, పేద రైతాంగానికి పంపిణీ చేసింది. ఈ ప్రజల ప్రజాస్వామిక ప్రభుత్వాలు వర్గ పోరాటం కేంద్రంగా, ప్రజల సర్వతోముఖ అభివృద్ధికి కట్టుబడి, స్వావలంబన, సహకారం విలువలపై ఆధారపడి ఒక కొత్త, ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను ముందుకు తెస్తున్నాయి. విప్లవ భూసంస్కరణల్లో భాగంగా వ్యవసాయ విధానాలలో కూడా మార్పులు ప్రవేశపెడుతున్నాయి. తొలి రోజుల్లో శ్రమ సహకార టీంలు, విత్తనాల బ్యాంకులతో మొదలై, ఇప్పుడు పొలాలకు నీళ్లు అందించడం కోసం చెరువుల నిర్మాణం, చేపల పెంపకం, గ్రామాల్లో పండ్ల మొక్కల పెంపకం, కూరగాయల పెంపకం, తాగునీటి చెలిమెల నిర్మాణం వంటి ప్రజోపయోగ పనులు ఎన్నెన్నో ప్రజలు స్వయంగా చేపట్టారు. ప్రధానంగా సామూహిక శ్రమదానంపై ఆధారపడి, తక్కువ వనరులతో నిర్మాణమైన ఈ పనులతో ప్రజలకు పంటలు పండించుకోవడానికి, ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచుకోవడానికి ఎంతో తోడ్పాటు లభించింది.

స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పి 64 ఏళ్లు గడిచినా ఆదివాసులకు విద్య అందించేందుకు దోపిడీవర్గాల ప్రభుత్వాలు నిజాయితీతో కూడిన కృషి ఏనాడూ చేపట్టలేదనే వాస్తవం దేశంలో ఏ ఆదివాసీ ప్రాంతాన్ని పరిశీలించినా తెలుస్తుంది. ప్రత్యేకించి దండకారణ్యంలో ఇది మరింత వాస్తవం. కాగా క్రాంతికారీ జనతన సర్కార్ నేతృత్వంలో ప్రజలు తమంతట తామే దాదాపు 100 కేంద్రాలలో ప్రాథమిక స్థాయిలో స్కూళ్లను ఏర్పాటు చేసుకొని తమ మాతృభాషలో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పుకుంటున్నారు. విద్యకన్నా దయనీయమైన స్థితి వైద్యానిది. అలాంటిది విప్లవోద్యమం కృషితో చాలా గ్రామాల్లో ఆదివాసులకు నేడు చాలా నిమ్న స్థాయిలోనే అయినప్పటికీ ప్రాథమిక వైద్యం అందుబాటులోకి వచ్చింది.

ఈ క్రమంలో సాంస్కృతికంగా కూడా ప్రజల జీవితంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా మహిళలపై సాగే పితృస్వామ్య పీడనను ఒక మేరకు తగ్గించడంతో మహిళలు విప్లవోద్యమంలో చురుగ్గా పాలు పంచుకోగల్గుతున్నారు. బలవంతపు పెళ్లిళ్లు లేకుండాపోయాయి లేదా గణనీయంగా తగ్గిపోయాయి. స్త్రీలు, పురుషులు సమానమేననే భావన సర్వత్రా పెంపొందుతున్నది. అలాగే మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసే క్రమం కూడా కొనసాగుతున్నది.

'క్రాంతికారీ జనతన సర్కార్' నాయకత్వంలో ప్రజలు గత రెండు సంవత్సరాలు వరుసగా ఫిబ్రవరి నెలలో 'భూమి సమతలీకరణ' క్యాంపెయిన్లు చేపట్టి ఉత్పాదకతను పెంచుకోవడం కోసం కృషి చేశారు. ఈ క్యాంపెయిన్‌లో పదుల వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఇలా గ్రామగ్రామాన విప్లవ ప్రజా ప్రభుత్వం ప్రజల జీవితంలో భాగమైంది. ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా దండకారణ్యంలో అభివృద్ధి చెందుతున్నది.

ప్రజాయుద్ధం ద్వారా భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గాల పాలనను కూలదోసి కార్మికవర్గ నాయకత్వంలో, కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా వర్గాలతో కలిసి ఐక్య సంఘటనగా ఏర్పడి ప్రజల ప్రజాస్వామ్య పాలనను నెలకొల్పే లక్ష్యంతో, ప్రాంతాల వారీగా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకునే మావోయిస్టు అవగాహనకు ఆచరణాత్మక వుదాహరణగా నేడు దండకారణ్యంతో పాటు బీహార్-ఝార్ఖండ్‌లో, దేశంలోని మరి కొన్ని ప్రాంతాల్లో విప్లవ ప్రజా ప్రభుత్వం ఉదయిస్తూ, అభివృద్ధి చెందుతున్నది. నేడు ఇది చాలా ప్రాథమిక స్థాయిలో, అత్యంత బలహీనంగానే, కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమై వున్నప్పటికీ ఇది అభివృద్ధి దిశలో పురోగమిస్తున్నది.

భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల వర్గ పాలనకు అంతం పలికే భారత నూతన ప్రజాస్వామిక విప్లవానికి నేడు దేశం నడి మధ్యన జరుగుతున్న పీడిత ప్రజల నూతన అధికార అంగాల ఆవిర్భావం వేగుచుక్కగా నిలిచింది. ఇది దేశవ్యాప్తంగా పీడిత ప్రజలకు ఆశాకిరణంగా, ఆదర్శంగా వున్నది. సరిగ్గా అందుకే దోపిడీ పాలకులు తీవ్రంగా కలవరపడుతున్నారు. సైన్యంతో దీన్ని అణచివేసి ఈ ప్రక్రియను త్వరగా ముగించగలమని భ్రమ పడుతున్నారు. **నేడు భారత సైన్యం ఇక్కడ యుద్ధానికి దిగుతున్నది అత్యంత వెనుకబడిన ఆదివాసులతోనే కాదు, వాళ్లు ప్రాథమిక స్థాయిలో నిర్మించుకుంటున్న నూతన ప్రజాస్వామిక అధికారంతో, వాళ్లు ముందుకు తెస్తున్న అత్యంత ప్రగతిశీల అభివృద్ధి నమూనాతో కూడా!**

## 'ప్రజలపై యుద్ధం'లో భాగంగా సాగుతున్న సామూహిక హత్యాకాండలు

'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో దేశవ్యాప్త బహుముఖ దాడి మొదలైనప్పటి నుండి ప్రజలు, ప్రజాస్వామికవాదులు దీన్ని 'ప్రజలపై యుద్ధం'గా అభివర్ణిస్తున్నారు. ఈ రెండున్నర ఏళ్లలో సాయుధ బలగాల చేతిలో హతులైన దాదాపు 250 మందిలో 90 శాతానికి పైగా సాధారణ, నిరాయుధ ప్రజలే. అసలు దండకారణ్యంలో గ్రీన్‌హంట్ ప్రారంభమే సామూహిక హత్యాకాండలతో మొదలైంది.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ అధికారికంగా మొదలు కాకముందు, రమన్‌సింగ్ రెండోసారి అధికారంలోకి వచ్చిన రెండు నెలల తర్వాత, 2009 జనవరి 9న దంతెవాడ జిల్లా సింగారం వద్ద పోలీసులు ఐదుగురు మహిళలు సహా 17 మంది గ్రామస్తులను ఊచకోత కోశారు. జూన్ 20న బస్తర్ జిల్లా కోకవాడ దగ్గర సామూహిక హత్యాకాండకు పాల్పడి ఆరుగురు గ్రామస్తుల్ని కాల్చి చంపారు.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదలైన తర్వాత 2009 ఆగస్టు 10న పశ్చిమ బస్తర్ (బీజాపూర్ జిల్లా)లోని వెచ్చాపాడ్ గ్రామంలో మొట్టమొదటి సారిగా రంగంలోకి దిగిన కోబ్రాలు సామూహిక హత్యాకాండకు పాల్పడి ఒక మహిళ సహా ఆరుగురిని హతమార్చారు. చనిపోయిన వాళ్లలో 16 సంవత్సరాల యువతి సోమ్లి మాత్రమే పి.ఎల్.జి.ఏ. సభ్యురాలు కాగా మిగతా వాళ్లంతా సాధారణ ఆదివాసులు. సోమ్లి అనారోగ్యం మూలంగా నిరాయుధంగా గ్రామంలో విశ్రాంతి తీసుకుంటూ వుండింది. వీళ్లందరినీ సంతకు పోతుండగా పట్టుకొని అప్పటి దంతెవాడ డి.ఐ.జి. ఎస్.ఆర్.పి. కల్లూరి ప్రత్యక్ష నేతృత్వంలో కోబ్రా బలగాలు కాల్చి చంపాయి.

2009 సెప్టెంబర్ 8న దంతెవాడ జిల్లాలోని గొల్లగూడెం గ్రామంలో ఒక మహిళ సహా నలుగురు గ్రామీణులను పోలీసులు, కోబ్రాలు పట్టుకొని కాల్చి చంపారు. సెప్టెంబర్ 17న సింగన్‌మడుగు, గచ్చన్‌పల్లి, గట్టంపాడు, పాలచెలిమ గ్రామాల్లో ఒకేసారి దాడి చేసి 70 ఏళ్ల వృద్ధురాలైన దూది మూయె సహా మొత్తం 12 మందిని కాల్చి చంపారు. అక్టోబర్ 1న గోంపాడ్ గ్రామంలో దాడి చేసి ముగ్గురు మహిళలు సహా 12 మంది ఆదివాసులను హతమార్చారు. నవంబర్ 10న కొంట తాలూకాలోని టెట్టెమడుగు, పాలోడ్ గ్రామాల్లో దాడులు చేసి ఒకే రోజు ఏడుగురిని కాల్చి చంపారు. డిసెంబర్ 11న దంతెవాడ జిల్లాలోని గుమియాపాల్ గ్రామంలో దాడి చేసి ఏడుగురు ఆదివాసులను కాల్చి చంపారు.

2010 ఫిబ్రవరి 3న బీజాపూర్ జిల్లాలోని తాకిలోడ్ గ్రామంలో ఏడుగురు ఆదివాసులను పట్టుకొని 'ఎన్‌కౌంటర్' పేరుతో కాల్చి చంపారు. ఫిబ్రవరి 7న నారాయణపూర్ జిల్లాలోని ఓంగ్‌నార్ గ్రామంలో ఇద్దరు మహిళలు సహా ఐదుగురు నిరాయుధ గ్రామస్తులను కాల్చి చంపారు. అక్టోబర్ 8న గడ్చిరోలి జిల్లా సావర్‌గాంలో ఐ.టి.బి.పి. జవాన్లు విచ్చలవిడిగా మోర్టార్ షెల్స్ వేసి ఆరుగురు గ్రామస్తులను హత్య చేశారు. ఇందులో కొందరు స్కూలు పిల్లలున్నారు. మరెందరో గాయపడ్డారు. అక్టోబర్ 9న మహాసముంద్ జిల్లాలోని పడ్కీపాలీ గ్రామం సమీపంలో పి.ఎల్.జి.ఏ. కంపెనీపై పోలీసులు పొంచి వుండి దాడి చేయగా ఆరుగురు గెరిల్లాలు చనిపోయారు. అదే సమయంలో ఇద్దరు గ్రామస్తుల్ని కూడా పోలీసులు పట్టుకొని కాల్చిచంపారు. నవంబర్ 23న జెగురుగొండకు చెందిన మెట్టగూడ పార వద్ద ప్రజా మిలిషియాకు చెందిన 9 మందిని పట్టుకొని కాల్చి చంపారు.

## మహిళలపై కొనసాగుతున్న అమానుష అత్యాచారాలు

సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లలో అందరికన్నా ఎక్కువ హింసకు, అత్యాచారాలకు, అవమానాలకు గురైంది, గురవుతున్నది మహిళలే. చరిత్రలో దోపిడీ వర్గాలు సాగించిన అన్యాయ యుద్ధాలన్నిటిలోనూ మహిళలనే ఎక్కువగా హింస, అత్యాచారాలకు బలి చేశారన్నది ఒక వాస్తవం. సల్వాజుడుం దాడులలో పశ్చిమ బస్తర్, దక్షిణ బస్తర్‌లతో పాటు, మాడ్‌లోని ఇంద్రావతి ప్రాంతంలో మహిళలు దారుణ హింసకు గురయ్యారు. గ్రామాల్లో దాడుల సందర్భంగా పోలీసులు, పారామిలిటరీ, ఎస్.పి.ఓ.లు, జుడుం గూండాలు మహిళలపై మూకుమ్మడి అత్యాచారాలకు పాల్పడ్డారు. చాలా మందిని అత్యాచారం తర్వాత గొంతుల్ని కోసేసి దారుణంగా హత్య చేశారు. బీజాపూర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని పది గ్రామాల్లోనే 74 మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారంటే దండకారణ్య వ్యాప్తంగా వున్న వేలాది గ్రామాల్లో ఎందరు మహిళలు అత్యాచారాలకు గురయ్యారో, రోజూ ఎందరు గురవుతున్నారో ఊహకు కూడా అందడం కష్టమే. భర్తలను, పిల్లలను లేదా తండ్రులను కాపాడుకోవడం కోసం స్వయంగా బలైపోయిన మహిళలెందరో. ఎందరో మహిళలను పట్టుకెళ్లి, జుడుం శిబిరాలలో బలవంతంగా నిర్బంధించి వారాలు, నెలల పాటు అత్యాచారాలకు గురి చేశారు. ఎస్.పి.ఓ.లు, గూండాలు చాలా మందిని బలవంతంగా 'భార్యలు'గా వుంచుకున్నారు. విప్లవోద్యమంలో భాగస్వాములైన వాళ్ల కుటుంబాల మహిళలను కూడా ఇలా బలవంతంగా తీసుకెళ్లి తమలో కలిపేసుకున్నారు. అలా తండ్రికి వ్యతిరేకంగా బిడ్డను, అన్నకు వ్యతిరేకంగా చెల్లిని, పిల్లలకు వ్యతిరేకంగా తల్లిని శత్రువులుగా నిలబెట్టిన వుదాహరణలు కూడా చాలానే వున్నాయి.

గ్రీన్‌హంట్ మొదలైన తర్వాత మహిళలపై హింస, అత్యాచారాలు, హత్యలు మరింతగా పెరిగాయి. ముఖ్యంగా ప్రభుత్వాలు ఎస్.పి.ఓ.లతో, గూండాలతో హంతక ముఠాలు ఏర్పాటు చేసి విప్లవోద్యమంలో వివిధ రంగాల్లో భాగస్వాములైన మహిళలపై దాడులు చేయిస్తున్నాయి. మాడ్ ప్రాంతంలో క్రాంతికారీ జనతన సర్కార్ నిర్వహించే వ్యవసాయ క్షేత్రంలో ఒంటరిగా పని చేస్తున్న కుమ్మి అనే కార్యకర్తను 2010

ఫిబ్రవరి 12న కిరాయి హంతకులు పట్టుకొని సామూహిక అత్యాచారం జరిపి గొంతు కోసేసి దారుణంగా హత్య చేశారు. అదే సంవత్సరం ఆగస్టు 17న పార్టీ ప్రెస్‌లో పని చేసే చైతె అనే కార్యకర్తను ఒంటరిగా స్నానానికి వెళ్లినపుడు పట్టుకొని ఇదే విధంగా క్రూరంగా హత్య చేశారు. ఇంకా కొందరు మహిళలు ఇలాంటి దాడుల నుండి తప్పించుకున్నారు.

## సైనిక తరహా భారీ దాడులు

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో మొదటి సంవత్సరంనర కాలంలో ప్రభుత్వ సాయుధ బలగాలు ఎక్కువగా సామూహిక హత్యాకాండలకు పాల్పడగా 2011 ప్రారంభం నుండి దాడులలో చాలా మార్పులు వచ్చాయి. వేల సంఖ్యలో బలగాల్ని సమీకరించి ఎంచుకున్న పాకెట్లను ఒకేసారి అన్ని వైపుల నుండి చుట్టుముట్టి దాడులకు పాల్పడడం ఒక ముఖ్య రూపంగా ముందుకొచ్చింది. ఇవి ఉన్నత సైనికాధికారుల ప్రత్యక్ష గైడెన్స్‌లో రూపొందిస్తున్న పథకాల ప్రకారం జరుగుతున్నాయి. వీటికి పోలీసు, పారామిలిటరీ బలగాలకు చెందిన ఎస్.పి., డి.ఐ.జి., ఐ.జి. స్థాయి అధికారులు ప్రత్యక్షంగా నాయకత్వం వహిస్తున్నారు. ఇలాంటి దాడులలో గ్రామాల్లో వీలైన మేరకు విధ్వంసం చేయడం, కొందరిని కాల్చి చంపడం, మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం, ఎక్కువ మందిని పట్టుకొని పోవడం వంటి పద్ధతులు అనుసరిస్తున్నారు. పట్టుకొని పోయిన వాళ్లలో కొందరిని వదిలెయ్యడం, కొందరిని నయానా భయానా లొంగదీసుకొని ఇన్‌ఫార్మర్లుగా మార్చుకోవడం, మరి కొందరిని తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుపాలు చెయ్యడం వీళ్ల పాలసీగానే వుంటున్నది. ఇలా జైళ్లన్నీ ఆదివాసులతో నిండిపోతున్నాయి.

2011 అక్టోబర్‌లో గడ్చిరోలి జిల్లా ధనోర తాలూకా గ్యారపత్తి, మాలెవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదు వేల సంఖ్యలో సి.ఆర్.పి.ఎఫ్.-కోబ్రా, సి-60 కమాండో, స్థానిక పోలీసులు కలిసి ఒక భారీ ఆపరేషన్ చేపట్టి పెద్ద ఎత్తున కూంబింగ్‌లు నిర్వహించారు. దాదాపు 150 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఈ ఆపరేషన్ నడిపారు. అడవిలో 11 చోట్ల క్యాంపులు వేసి ఒక్కో క్యాంపులో కనీసం 300 మంది బలగాల్ని దించారు. గ్యారపత్తి ప్రాంతంలోని మొత్తం 19 గ్రామాలను ఈ బలగాలు కవర్ చేశాయి. పగలు, రాత్రి నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో మొత్తం 12 మంది ప్రజల్ని అరెస్టు చేశారు. చాలా మందిని కొట్టారు. ఇండ్లల్లోకి దూరి భర్మార్లు, కత్తులు, గొడ్డళ్లు, డబ్బులు వగైరా ఎత్తుకెళ్లారు. ఆపరేషన్ ముగింపులో పి.ఎల్.జి.ఏ. బలగాలు రాత్రి పూట నిర్వహించిన ఆంబుష్‌లో ఒక కోబ్రా చనిపోగా, మరో 8 మంది గాయపడ్డారు.

2011 నవంబర్ 24 నుండి 27 వరకు పశ్చిమ, దక్షిణ బస్తర్ ప్రాంతంలోని గోర్నం, మన్‌కేలి తదితర మొత్తం 16 గ్రామాలను కవర్ చేస్తూ 35 కిలోమీటర్ల పొడవున దాదాపు వెయ్యి మంది ప్రభుత్వ సాయుధ బలగాలు అనేక చోట్లలో ఆంబుష్‌లు ఏర్పాటు చేశాయి. గ్రామస్తుల కంట్లో పడకుండా పూర్తిగా అడవుల్లోంచే ప్రయాణించి అన్ని ముఖ్యమైన తోవల్ని కవర్ చేసేలా ఈ ఏరియా ఆంబుష్‌ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద బంకర్లు నిర్మించుకొని, తోవలకు మైన్స్ కూడా ఏర్పాటు చేసి ముఖ్యమైన నాయకత్వ కామ్రేడ్స్ వాటి మీదకు రాగానే పేల్చి వెయ్యాలని కుట్ర పన్నారు. మూడు రోజుల పాటు తమతో పాటు తెచ్చుకొన్న తిండినీ, నీళ్లనే వాడుకుంటూ ముఖ్యమైన విప్లవోద్యమ నాయకత్వ కామ్రేడ్స్‌ను హత్య చేయాలని విఫల ప్రయత్నం చేశారు.

2011 డిసెంబర్ 19న దక్షిణ బస్తర్ డివిజన్ (దంతెవాడ జిల్లా)లోని చిన్న కేడ్‌వాల్, పెద్ద కేడ్‌వాల్ గ్రామాలపై హెలికాప్టర్ల ద్వారా ఒక భారీ దాడిని నిర్వహించారు. ఏక కాలంలో పోలెంపల్లి, కిష్టారం, బెజ్జి పోలీసు క్యాంపుల నుండి దాదాపు 15 హెలికాప్టర్లలో అనేక ట్రిప్‌లలో బలగాల్ని దించారు. అదే సమయంలో కింది నుండి కూడా బలగాలు మూడు వైపుల నుండి అక్కడికి చేరుకున్నాయి. ఈ రెండు గ్రామాల్లో దాడులు చేసి కొన్ని ఇండ్లను పూర్తిగా ధ్వంసం చేసి మొత్తం 12 మందిని అరెస్టు చేశారు. చాలా ఇండ్లలో నుండి పదుల వేల రూపాయల నగదు డబ్బుతో సహా అనేక విలువైన సామాన్లు దోచుకెళ్లారు. ఒక మహిళపై అత్యాచారానికి పాల్పడబోగా పక్కనే వున్న ఒక రైతు తన దగ్గరున్న భర్మార్ తుపాకీతో ప్రతిఘటించాడు. దాంతో ఆ మహిళ తప్పుకోగలిగింది. పి.ఎల్.జి.ఏ. గెరిల్లాలు ఆత్మరక్షణలో భాగంగా ప్రభుత్వ సాయుధ బలగాలపై నాలుగు చోట్ల ఎదురుదాడులకు దిగారు. ఇరువైపులా ఎలాంటి నష్టం జరగలేదు. డిసెంబర్ 22న రాయపూర్ నుండి వెలువడే హిందీ దినపత్రిక 'దైనిక్ భాస్కర్' రానున్న రోజుల్లో దండకారణ్యంలో జరగబోయేవి ఇలాంటి దాడులే అని హెచ్చరించింది.

2012 ఫిబ్రవరి 27 నుండి మార్చ్ 1 వరకు పశ్చిమ బస్తర్ డివిజన్ (బీజాపూర్ జిల్లా) గంగులూరు ఏరియాలో ప్రభుత్వ సాయుధ బలగాలు దాదాపు 2 వేల సంఖ్యతో బయలుదేరి ఒక భారీ ఆపరేషన్ నిర్వహించారు. దీనికి డి.ఐ.జి. స్థాయి అధికారి ప్రత్యక్ష నాయకత్వం వహించాడు. ఎడ్సుం, ఇర్మగొండ, మద్దుం, కావడ్ గ్రామాలను లక్ష్యంగా చేసుకొని సాగించిన ఈ దాడిలో మొత్తం 13 మందిని అరెస్టు చేశారు. ప్రజలు, పి.ఎల్.జి.ఏ. గెరిల్లాలు సాగించిన ఆత్మరక్షణా దాడుల్లో ఇద్దరు కోబ్రాలు గాయపడ్డారు.

2012 మార్చ్ మొదటి, రెండో వారాల్లో మాడ్ ప్రాంతాన్ని మూడు వైపుల నుండి - ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, నారాయణ్‌పూర్ జిల్లాల నుండి, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా నుండి ఒకేసారి చుట్టుముట్టి 3 వేల మందితో ఒక భారీ ఆపరేషన్ నిర్వహించారు. దీనికి 'ఆపరేషన్ విజయ్', 'ఆపరేషన్ హాకా' అనే పేర్లు పెట్టారు. అనేక మంది ఐ.పి.ఎస్. అధికారులు ఈ ఆపరేషన్‌కు ప్రత్యక్ష నాయకత్వం వహించారు. సి.ఆర్.పి.ఎఫ్. డి.జి. విజయ్‌కుమార్ సహా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర డి.జి.పి.లు దీనికి పథక రచన చేశారు. దాదాపు పాతిక గ్రామాలపై దాడులకు, విధ్వంసానికి పాల్పడ్డ ఈ దాడుల్లో తోకె గ్రామానికి చెందిన డుంగ ధుర్వ అనే ఆదివాసీని సాయుధ బలగాలు హత్య చేశాయి. గొడ్డెల్‌మర్క గ్రామ యువకుడు లాల్సును ఎత్తుకెళ్లి 'మాయం' చేశారు. ఇండ్లలోంచి వేలాది రూపాయల నగదుతో సహా అనేక విలువైన సామాన్లు ఎత్తుకెళ్లారు. ఈ సందర్భంగా పి.ఎల్.జి.ఏ. బలగాలు సాగించిన ప్రతిఘటనలో ఇద్దరు కోబ్రాలు గాయపడ్డారు.

## హైటెక్ యుద్ధంగా సాగుతున్న 'ప్రజలపై యుద్ధం'

ప్రజలపై సాగుతున్న ఈ యుద్ధాన్ని సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల విప్లవప్రతిఘాతుక యుద్ధాల అనుభవాల ఆధారంగా రూపొందిన తక్కువ తీవ్రత గల ఘర్షణ (ఎల్.ఐ.సి.) వ్యూహానికి భారతీయ అనుకరణగా చెప్పవచ్చు. తెలంగాణా, కాశ్మీర్, ఈశాన్య ప్రాంతం, నక్సల్బరీ, పంజాబ్ తదితర ప్రాంతాల్లో తాము కొనసాగించిన అణచివేత క్యాంపెయిన్ల నుండి లభించిన అనుభవాల,

గుణపాఠాల ఆధారంగా భారత పాలకవర్గాలు ఈ యుద్ధాన్ని నిర్వహిస్తున్నాయి. అమెరికన్ సలహాదారుల దిశానిర్దేశకత్వంలో సైనిక, గూఢచర్య సంస్థల వున్నతాధికారులు ఈ యుద్ధానికి పథక రచన చేస్తున్నారు. ఆధునిక ఆయుధాలతో, కమ్యూనికేషన్ పరికరాలతో సాయుధమై జంగల్ వార్‌ఫేర్ కాలేజ్‌లలో శిక్షణ పొందిన పోలీసు, అర్ధసైనిక, ప్రత్యేక కమాండో బలగాలతో పాటు సైన్యాన్ని కూడా దించి ఈ యుద్ధం కొనసాగిస్తున్నారు. మావోయిస్టు కార్యకలాపాలపై, కదలికలపై నిఘా కోసం అంతరిక్ష పరిశోధనా సంస్థల వుపగ్రహాలు, మానవరహిత విమానాలు (డ్రోన్‌లు), ఆధునిక హెలికాప్టర్‌లు, జి.పి.ఎస్. పరికరాలు, శాటిలైట్ ఫోన్స్ తదితర సామ్రాజ్యవాదుల నుండి దిగుమతి చేసుకున్న హైటెక్ సామగ్రినంతా ఈ యుద్ధంలో వుపయోగిస్తున్నారు. అదే సమయంలో నేడు ఆయుధాల కొనుగోలులో భారతదేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచిందనేది కూడా ప్రత్యేకంగా గమనార్హం.

ఇకపోతే డ్రోన్‌లుగా పిలిచే మానవరహిత విమానాలను పెద్ద ఎత్తున వుపయోగిస్తూ ఫోటోలు తీస్తున్నారు. వీటి ఆధారంతో విప్లవోద్యమ నాయకత్వాన్ని, గెరిల్లా బలగాలను హతమార్చే కుట్రలు వేగంగా జరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయి మావోయిస్టు నేతలపై ప్రధానంగా కేంద్రీకరిస్తూ, లక్షల రూపాయల రివార్డులు ప్రకటిస్తూ విప్లవోద్యమానికి వ్యూహాత్మక నాయకత్వం లేకుండా చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు. ఇంటలిజెన్స్‌పై ఆధారపడిన సర్జికల్ ఆపరేషన్స్ నిర్వహించాలని కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ థింక్‌టాంక్‌లు పదే పదే నొక్కి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పాలకవర్గాలు రానున్న కాలంలో డ్రోన్‌ల ద్వారా దాడులకు కూడా పూనుకునే అవకాశం వుంది. అమెరికా సామ్రాజ్యవాదుల నుండి అన్ని విధాల అండదండలు పొందుతున్న భారత పాలకులు ఇలా బరితెగించినా ఆశ్చర్యం ఏమీ లేదు. **వాయువ్య పాకిస్తాన్ ఆదివాసుల వలెనే దండకారణ్య ఆదివాసుల ప్రాణాలు కూడా మానవరహిత విమానాల అమానవీయ దాడులకు బలయ్యే ప్రమాదం పొంచి వుంది. దండకారణ్యాన్ని, దేశంలోని ఆదివాసీ ప్రాంతాలన్నిటినీ మానవరహితం చేయడమే ఈ మానవరహిత విమాన ప్రయోగాల లక్ష్యం.**

## ప్రభుత్వ సాయుధ బలగాల సంఖ్యలో భారీ పెంపుదల

పాలకుల ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా దేశంలో వ్యాప్తి చెందిన పేదరికం, నిరుద్యోగం తదితర సమస్యలను ఆసరా చేసుకొని వుద్యమ ప్రాంతాల్లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ యువజనులను పెద్ద ఎత్తున సాయుధ బలగాల్లో చేర్చుకుంటున్నారు. పోరాట ప్రాంతాల్లోని ప్రజావ్యతిరేక, లంపెన్, అరాచక శక్తులను పెద్ద ఎత్తున ఎస్.పి.ఓ.లుగా భర్తీ చేసుకుంటున్నారు. వీళ్లే కాకుండా సాధారణ యువజనులను కూడా ఉపాధి ఆశ చూపించి లేదా అరెస్టు చేసి భయపెట్టి భర్తీ చేసుకుంటున్నారు. ఉదాహరణకు లింగారాం కొడొపి అనే ఆదివాసీ యువకుణ్ని పోలీసులు ఇదే విధంగా బలవంతంగా ఎస్.పి.ఓ.గా చేర్చుకోగా అందులోంచి బైటపడడం కోసం అతను హైకోర్టుకు పోవల్సి వచ్చింది. స్థానిక ఎస్.పి.ఓ.ల నుండి దూకుడుగా, అరాచకంగా వుండేవాళ్లను ఎంపిక చేసి కోయ కమాండో, మాడ్ కమాండో తదితర పేర్లతో ప్రత్యేక కమాండో బలగాలను తయారు చేస్తున్నారు. వీళ్లకు రాష్ట్రీయ రైఫిల్స్, గ్రేహౌండ్స్, జంగల్ వార్‌ఫేర్ స్కూళ్లు ట్రెయినింగ్ ఇస్తున్నాయి.

పోలీసు, అర్ధసైనిక, సైనిక బలగాల్లో భర్తీ కోసం రిక్రూట్‌మెంట్ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇందులో స్థానికులను పెద్ద ఎత్తున చేర్చుకోవడానికి ప్రాథమ్యతనిస్తున్నారు. స్థానిక భాషలు తెలిసి, భౌగోళిక పరిస్థితులపై పట్టు కలిగిన వాళ్లను ఆపరేషన్స్‌లో పెద్ద ఎత్తున వుపయోగించుకునే పథకంలో భాగమే ఇది. ఛత్తీస్‌గఢ్‌లో పెద్ద ఎత్తున పోలీసులను భర్తీ చేసుకుంటున్నారు. మావోయిస్టు వుద్యమం సాగుతున్న మిగతా రాష్ట్రాలన్నిటిలోనూ ఇది కొనసాగుతున్నది. దేశంలో పోలీసుల సగటు సంఖ్య లక్ష జనాభాకు 160 కాగా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లలో లక్ష జనాభాకు 205 మంది పోలీసులున్నారు.

అన్ని రాష్ట్రాలలో ప్రత్యేక కమాండో బలగాలను ఏర్పాటు చేసి వాటికి ప్రత్యేక శిక్షణనిస్తూ, అదనంగా ప్రోత్సాహకాల్ని, భత్యాల్ని ఇస్తున్నారు. ప్రజలను కొట్టడానికి, కాల్చి చంపడానికి, దోచుకోవడానికి, మహిళలపై అత్యాచారాలకు పాల్పడడానికి ఈ బలగాలకు విచ్చలవిడి అధికారాలిచ్చి క్రూర మృగాల్లాగా తయారు చేస్తున్నారు. నిజానికి ఈ ప్రత్యేక బలగాలకు క్రూర మృగాల పేర్లే పెడుతున్నారు. ప్రజలే కాదు, పాలకులు కూడా వీళ్లను మనుషుల కన్నా మృగాలుగానే చూస్తారు. గ్రేహౌండ్స్ (బూడిద రంగు కుక్కలు), హాక్ ఫోర్స్ (డేగలు), కోబ్రా (తాచుపాములు), జాగ్వార్ (అడవి పిల్లులు), బ్లాక్ క్యాట్ (నల్ల పిల్లులు) వగైరా పేర్లన్నీ వాటి స్వభావానికి అద్దం పట్టేవే. ప్రజలను చంపినందుకు బహుమతులు, అవార్డులు, ప్రమోషన్లు ఇవ్వడం ద్వారా వీళ్లను మరింత క్రూరులుగా మారుస్తున్నారు. ఇటీవల 'ఎన్‌కౌంటర్ల'లో నక్సలైట్లను చంపినందుకు గాను 38 మంది పోలీసు అధికారులకు, జవాన్లకు ఔట్ ఆఫ్ టర్న్ ప్రమోషన్లు ఇచ్చారు. మరి కొంత మందికి నగదు పురస్కారాలిచ్చారు. అనేక మంది మహిళలపై అత్యాచారాలకు పాల్పడి, ఎన్నో ఘోర నేరాల్లో భాగస్వామి అయిన కర్తం సూర్య అనే కోయ కమాండో కమాండర్‌కు (ఇతను 2012 ఫిబ్రవరి 9న పి.ఎల్.జి.ఏ. ఆంబుష్‌లో చనిపోయాడు) గతంలో 'మా దంతేశ్వరి' తదితర అవార్డ్‌లు ఇవ్వడం, సోనీ సోడి అనే ఆదివాసీ వుపాధ్యాయినిని అమానుషంగా హింసించిన దంతెవాడ ఎస్.పి. అంకిత్ గర్గ్‌కు 2012 జనవరి 26న రాష్ట్రపతి వీరత్వ పురస్కారం ఇవ్వడం మరి కొన్ని వుదాహరణలుగా చెప్పుకోవచ్చు.

## ప్రజలను పోరుపథంలోంచి పక్కదారి పట్టించడానికే బూటకపు సంస్కరణలు

ప్రజలపై సాగిస్తున్న ఈ యుద్ధంలో పాలకులు 'క్లియర్, హోల్డ్ అండ్ బిల్డ్' అనే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. ఒక్కోసారి హోల్డ్, బిల్డ్ విధానాలను కలగలిపి అమలు చేస్తుండగా మరి కొన్ని సార్లు ఇవి అటు, ఇటుగా మారుతున్నాయి. విప్లవోద్యమాన్ని అణచివెయ్యడం, ఈ ప్రాంతాన్ని సాయుధ బలగాల పట్టులోకి తెచ్చుకోవడం, తమ రాజ్యవ్యవస్థను తిరిగి స్థాపించడం – ఇదే ఈ వ్యూహం సారాంశం. ఇందులో భాగంగా సాయుధ బలగాల దాడులు ఒకవైపు, బూటకపు అభివృద్ధి కార్యక్రమాలు మరోవైపు జమిలిగా కొనసాగుతున్నాయి. ఇటీవల ఝార్ఖండ్‌లోని సరండా అటవీ ప్రాంతంలో 'సరండా యాక్షన్ ప్లాన్' పేరుతో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన బూటకపు అభివృద్ధి ప్యాకేజీను, అదే సమయంలో 'ఆపరేషన్ అనకొండ' పేరుతో సాగించిన సైనిక చర్యలను ఇందుకు తాజా వుదాహరణగా చెప్పుకోవచ్చు.

ప్లానింగ్ కమిషన్ సమగ్ర కార్యాచరణ పథకం (ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్ – ఐ.ఏ.పి.) పేరుతో 9 రాష్ట్రాలకు చెందిన 60 జిల్లాల కోసం

13,742 కోట్ల రూపాయలతో ఒక పంచవర్ష ప్రణాళికను తయారు చేసింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా దంతెవాడ జిల్లాకు వెయ్యి కోట్ల రూపాయల ప్యాకేజ్‌ను ప్రకటించారు. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో మంజూరవుతున్న వందల కోట్ల రూపాయల్లో అత్యధిక భాగం సాయుధ బలగాలకు అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణానికే కేటాయిస్తున్నారు. రోడ్లు, భవనాలు, వంతెనలు, మొబైల్ టవర్లు, విద్యుదీకరణ మొదలైన వాటిపైనే ప్రధానంగా డబ్బంతా ఖర్చు పెడుతున్నారు. ఇందులో ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యక్షంగా దోహదపడే కార్యక్రమాలు చాలా తక్కువ. ఈ పథకాలు ప్రజాకర్షణ స్వభావాన్ని కలిగి వున్నప్పటికీ ప్రజల మౌలిక అవసరాల్ని మాత్రం నెరవేర్చవు. నిజానికి ప్రజలను విప్లవోద్యమం నుండి పక్కదారి పట్టించడానికే ఇవన్నీ తప్ప ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి కావనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ బూటకపు అభివృద్ధి పథకాల ద్వారా ప్రజలను ప్రలోభాలకు గురి చేసి వారిలో చీలిక తెచ్చి, ఒక సెక్షన్‌ను తమకు అనుకూలంగా మల్చుకొని వాళ్లను ప్రభుత్వ యంత్రాంగానికి జోడించడం దోపిడీ ప్రభుత్వాల లక్ష్యం. ఇలా వాళ్లను ఒకవైపు తమకు అవసరమైన సామాజిక పునాదిగా మల్చుకోవాలని, మరోవైపు ఇన్‌ఫార్మర్లుగా మార్చి విప్లవోద్యమ అణచివేతలో వుపయోగించుకోవాలని చూస్తున్నారు. ఇలా ప్రజలను చీల్చి, విప్లవోద్యమ ప్రజా పునాదిని దెబ్బతీసి సాయుధ బలగాల దాడుల ద్వారా విప్లవ ప్రజాయుద్ధాన్ని అణచివెయ్యడం కోసమే ప్రభుత్వం ఈ 'అభివృద్ధి' కార్యక్రమాలను వాడుకుంటున్నది.

పక్కా రోడ్లపై, పోలీసు స్టేషన్ల/క్యాంపుల పరిసరాల్లో ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేసి బస్తర్ లోతట్టు గ్రామాల్లోంచి విద్యార్థులను బైటి ప్రాంతాలలోకి తరలించే ప్రక్రియ కూడా ఈ కుట్రలో భాగంగా కొనసాగుతున్నది. ఎడ్యుకేషన్ హబ్, పోటా కేబిన్ స్కూళ్లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ తదితర పేర్లతో గ్రామీణ విద్యార్థులను, యువజనులను జిల్లా కేంద్రాలలోకి రప్పిస్తున్నారు. తద్వారా వాళ్లు విప్లవోద్యమంలో చేరకుండా చూస్తున్నారు. అభివృద్ధి పనుల పేరుతో సాగిస్తున్న అన్ని రకాల కార్యకలాపాల్లో అవినీతి ఎంతగా వ్యాపించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే సమయంలో దండకారణ్యం నుండి కొల్లగొట్టుకొని పోతున్న రెవెన్యూతో పోల్చినపుడు 'అభివృద్ధి' పేరుతో కేటాయిస్తున్న ఈ మొత్తం డబ్బు ఏ మూలకూ రాదనేది గమనార్హం. **ఈ కార్యక్రమాల అంతిమ లక్ష్యం విప్లవోద్యమాన్ని దెబ్బతీసి ఈ మొత్తం ప్రాంతాన్ని కార్పొరేట్ దోపిడీకి నెలవుగా మల్చి ఇక్కడి సహజ వనరులన్నిటినీ విచ్చలవిడిగా కొల్లగొట్టడమే తప్ప మరొకటి కాదు.**

ఈ బూటకపు అభివృద్ధి కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేయడం కోసం ప్రభుత్వాలు పరిపాలనా యంత్రాంగాన్ని చాలా క్రియాశీలంగా పని చేయిస్తున్నాయి. దండకారణ్యంలో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా సాగుతున్న విప్లవప్రతిఘాతుక యుద్ధంలో ఐ.ఏ.ఎస్. అధికారుల పాత్ర ఎంత కీలకంగా వుందో అర్థం చేసుకోవడానికి కె.ఆర్. పిస్దా వుదాహరణ సరిగ్గా సరిపోతుంది. సల్వాజుడుం ప్రారంభ దినాల్లో దంతెవాడ కలెక్టర్‌గా వున్న పిస్దా (ఇతను కూడా ఆదివాసీయే) 'ఔట్‌లుక్' ఇంగ్లిష్ పత్రికతో (మే 15, 2006) మాట్లాడుతూ 'నువ్వు నక్సలైటువు కాకపోతే సల్వాజుడుంలో వుండితీరాలి. మూడో మార్గం ఏదీ లేదిక్కడ' అని చెప్పాడు. సల్వాజుడుంను నడిపించడంలో, సోకాల్డ్ సహాయ శిబిరాలల నిర్వహణకు బ్లూప్రింట్ రూపొందించడంలో ఇతనిది కీలక పాత్ర. సల్వాజుడుం మొదలైన రోజుల్లోనే కాంకేర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.కె. రాజు చేతిలో ఎస్.ఎల్.ఆర్. ఆయుధంతో పత్రికలకు పోజులిచ్చి నక్సలైట్లతో పోరాడడానికి తాను కూడా సిద్ధమని ('హరిభూమి' హిందీ దినపత్రిక, రాయపూర్ ఎడిషన్, జూలై 10, 2005) మాట్లాడాడు.

ఇలా వీళ్లు ఫాసిస్టు సల్వాజుడుం క్యాంపెయిన్ కాలంలో బరితెగించి ముందుకు రాగా, ప్రస్తుతం 'హోల్డ్, కంట్రోల్ & బిల్డ్' వ్యూహంలో భాగంగా వీళ్లు మానవీయ ముఖంతో ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా యువకులు, 'సమర్థులు', 'మచ్చలేని' వాళ్లు అయిన ఐ.ఏ.ఎస్. అధికారులను వెదికి మరీ ఈ ప్రాంతాల్లో మోహరిస్తున్నారు. వీళ్లు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల్ని తమ మోసపూరిత కార్యక్రమాలకు కట్టివేసే ఎత్తుగడలు అనుసరిస్తున్నారు. మీడియాలో వీళ్లకు చాలా ప్రాచుర్యం కలుగజేసి, ప్రజలకు మేలు చేసే వాళ్లుగా, నిజాయితీపరులుగా వీళ్ల ఇమేజ్‌ను కృత్రిమంగా తయారు చేస్తున్నారు.

మార్చ్ 2011లో చింతల్‌నార్ ప్రాంతంలోని నాలుగు గ్రామాలపై ప్రభుత్వ సాయుధ బలగాలు భారీ హింసకు, విధ్వంసానికి పాల్పడ్డప్పుడు దంతెవాడ కలెక్టర్ ప్రసన్న బాధిత ప్రజలకు సహాయ సామగ్రి చేరవేయడానికి ప్రయత్నించడం, కోయ కమాండో/జుడుం గూండాలు అతన్ని అడ్డుకోవడం తెలిసిందే. ఆ సందర్భంగా ప్రసన్నను కూడా 'ప్రజల మనిషి'గా పత్రికలు కీర్తించాయి. కాని అతన్ని 'ది హిందూ' పత్రిక రిపోర్టర్ 'పోలీసు బలగాలు పాల్పడుతున్న అకృత్యాలపై మీ స్పందన ఏమిటి' అని అడగగా, 'నా పని శాంతి భద్రతలకన్నా అభివృద్ధిపై కేంద్రీకరించడం' అని జవాబిచ్చాడన్నది గమనార్హం. **అలా ఇక్కడ ఒకవైపు సాయుధ బలగాలు సైనిక దాడులకు పాల్పడుతుండగా, మరోవైపు పరిపాలనా శాఖకు చెందిన వున్నతాధికార్లు 'అభివృద్ధి' పేరుతో ప్రజలపై కనిపించని దాడి చేస్తున్నారు! ముఖాలు వేర్వేరు, పాత్రలు వేర్వేరు తప్ప వీళ్లందరి లక్ష్యం మాత్రం ఒక్కటే.**

బూటకపు సంస్కరణల కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వం ఎన్.జి.వో.లను కూడా వుపయోగించుకుంటున్నది. మరోవైపు విప్లవోద్యమ ప్రాంతాలలో విదేశీ నిధులతో నడిచే పలు ఎన్.జి.వో.లు కూడా చొరబడి ప్రజలను రకరకాల భ్రమలలో ముంచెత్తి పోరుబాట నుండి తప్పించాలని చూస్తున్నాయి. ఇవి రుణాలివ్వడం, స్వయం ఉపాధి కల్పించడం వంటి ప్రజాకర్షక పథకాల్ని ప్రవేశపెడుతున్నాయి. మరి కొన్ని ఎన్.జి.వో.లు విప్లవాత్మక పదజాలాన్ని వుపయోగిస్తూ ప్రభుత్వంలో పేరుకున్న అవినీతికి, అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజలను 'చైతన్యపరుస్తున్నట్టు', 'పోరాడుతున్నట్టు' పోజు పెడుతూ ప్రజల్లో వేళ్లూనుకోవాలని చూస్తున్నాయి. మరోవైపు వివిధ మత సంస్థలు కూడా దండకారణ్యంలో పని చేస్తున్నాయి. ముఖ్యంగా మాడ్ ప్రాంతంలో చాలా కాలంగా పని చేస్తున్న రామకృష్ణ మిషన్ ప్రజలకు విద్యా, వైద్య సేవల్ని అందించే పేరుతో ప్రతిభావంతులైన మాడ్ యువతరాన్ని చేరదీసి విప్లవోద్యమం పట్ల విముఖుల్ని చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం కూడా వీళ్ల సేవల్ని మెచ్చి పెద్ద మొత్తాల్లో నిధులు సమకూర్చి తమ సంస్కరణ కార్యక్రమాల్లో చాలా వాటిని ఈ సంస్థ ద్వారానే చేయిస్తున్నది. వీళ్ల ద్వారా ఆదివాసులను హైందవీకరించే ప్రక్రియ కూడా చాపకింద నీరులా సాగిస్తున్నది.

## సివిక్ యాక్షన్ ప్రోగ్రాం - ప్రజలను మోసగించే చౌకబారు ఎత్తుగడ

అన్ని రకాల సాయుధ బలగాలు – సి.ఆర్.పి.ఎఫ్., బి.ఎస్.ఎఫ్., ఐ.టి.బి.పి.లతో పాటు ఇప్పుడు దిగిన భారత సైన్యం 'ప్రజలపై యుద్ధం'లో ఒక మోసపు ఎత్తుగడగా సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలు నడిపిస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీలు సి.ఎస్.ఆర్. పేరుతో ప్రజలను మోసం చేసినట్టుగానే ప్రజలను అణచివేసే ప్రభుత్వ సాయుధ బలగాలు ప్రజలకు మందులు, గిన్నెలు, వ్యవసాయ పనిముట్లు, స్కూలు పిల్లలకు సైకిళ్లు, పెన్సిళ్లు, పెన్నులు, కాపీలు, చెడ్డీలు, బనియన్లు, క్రీడాసామగ్రి మొదలైనవి పంచిపెడుతున్నారు. తీసుకోవడానికి నిరాకరించిన చోట్లలో ప్రజలను బెదిరించి, కొట్టి మరీ పంచుతున్నారు. సామ్రాజ్యవాదులు రూపొందించిన ఎల్.ఐ.సి. వ్యూహంలో 'ప్రజల మనస్సులను, హృదయాలను గెల్చుకోవడం' అనే ఎత్తుగడ ఒకటుంది. ఇందుకోసం దోపిడీ ప్రభుత్వాలు వందల కోట్ల రూపాయలు తమ సాయుధ బలగాలకు కేటాయిస్తున్నాయి. ఈ నిధుల్లో కూడా అవినీతిపరులైన అధికారులు కాజేయాల్సినంత కాజేసి కొంత భాగం ఖర్చు పెడుతున్నారు. ఇలా ప్రజలను భ్రమల్లో ముంచి విప్లవోద్యమం నుండి పక్కదారి పట్టించడంతో పాటు కొంత మందిని అవినీతిపరులుగా మార్చి వాళ్లను ఇన్‌ఫార్మర్లుగా వుపయోగించుకోవడం, సమాచారాన్ని సేకరించడం వాళ్ల అసలు వుద్దేశం. ఈ కార్యక్రమాల్ని పేపర్లలో, టి.వి. ఛానెళ్లలో పెద్ద ఎత్తున రంగురంగుల ఫోటోలతో ప్రచారం చేస్తూ సాయుధ బలగాల హంతక ముఖానికి మేలిముసుగు తొడిగే ప్రయత్నం చేస్తున్నారు. **గ్రామాలను, ఇండ్లను కాలబెట్టడం, ప్రజలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపడం, విపరీతంగా కొట్టడం, మహిళలను చెప్పనలవి కాని చిత్రహింసలకు, అత్యాచారాలకు గురి చెయ్యడం, ప్రజలను దోచుకోవడం, ప్రజల ఆస్తులను ధ్వంసం చెయ్యడం, పంటల్ని కాలబెట్టడం వగైరా అకృత్యాలకు పాల్పడే చేతులతోనే ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఎంగిలి మెతుకులు కూడా విదిలిస్తున్నారు.**

ప్రభుత్వ సాయుధ బలగాలతో పాటు టాటా, ఎస్సార్, గోదావరి ఇస్పాత్, జయస్వాల్స్ నెకో వంటి కార్పొరేట్ సంస్థలు, భిలాయ్ స్టీల్‌ప్లాంట్ కూడా సి.ఎస్.ఆర్.లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలతో ప్రజలను వంచిస్తున్నారు.

## కార్పొరేట్ మీడియా భాగస్వామ్యంతో మానసిక యుద్ధం

ప్రజలపై సాగుతున్న యుద్ధంలో దుష్ప్రచారంపై ఆధారపడిన మానసిక యుద్ధం ఒక ముఖ్యమైన పార్శ్వం. ఇందులో భాగంగా విప్లవకారులకు వ్యతిరేకంగా అబద్ధాలను, అర్ధసత్యాలను, అపోహలను, భ్రమలను వ్యాపింపజేసే ప్రయత్నాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. పత్రికలు, రేడియో, టి.వి. ఛానెళ్లు, హోర్డింగ్స్, కరపత్రాలు, పోస్టర్లు, డాక్యుమెంటరీలు తదితరాలన్నిటినీ వుపయోగించుకొని మావోయిస్టులను హింసావాదులుగా, ఉగ్రవాదులుగా, అభివృద్ధికి వ్యతిరేకులుగా చిత్రీకరిస్తూ భారీ ప్రచారం సాగిస్తున్నారు. ప్రభుత్వ సాయుధ బలగాలు తాము పాల్పడుతున్న హింసాత్మక చర్యలను, హత్యాకాండలను కప్పి పుచ్చుకుంటూ మావోయిస్టులు అమాయక ఆదివాసులను చంపుతున్నారనే అబద్ధ ప్రచారం చేస్తున్నారు. పార్టీ నాయకత్వం మధ్య విభేదాలున్నాయని, సమన్వయం లేదని, అగ్ర నాయకత్వం దెబ్బతినిపోయి ఉద్యమం బలహీనపడిందని... ఇలా అనేక రకాలుగా దుష్ప్రచార యుద్ధాన్ని సాగిస్తున్నారు.

పాలకవర్గాలు తమకు వంతపాడే మేధావులతో, విలేకరులతో, ద్రోహులుగా మారిన మాజీ నక్సలైట్లతో విప్లవోద్యమానికి వ్యతిరేకంగా అనేక వ్యాసాలు రాయిస్తున్నారు. టి.వి. చర్చా వేదికల్లో విప్లవోద్యమంపై, విప్లవ సిద్ధాంతంపై విషం కక్కిస్తున్నారు. మరోవైపు ప్రగతిశీల, విప్లవ రచయితలను, విలేకరులను కూడా తమ వేదికలకు, సెమినార్లకు ఆహ్వానించి అవార్డులివ్వడం, వాళ్ల పుస్తకాల్ని ప్రచురించడం, వాళ్లకు ఫ్లాట్లు, స్థలాలు కేటాయించడం తదితర సౌకర్యాలు కల్పించి తమలో ఇముడ్చుకోవడానికి, తద్వారా వాళ్లను భ్రష్టు పట్టించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇలా ప్రజల, ప్రజాస్వామికవాదుల, విప్లవకారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. ఇందులో కార్పొరేట్ మీడియా పాత్ర చాలా కీలకమైంది. దండకారణ్యంలో ప్రభుత్వ యంత్రాంగం వ్యాపింప జేస్తున్న అబద్ధాల్ని ప్రజల్లో ప్రచారం చెయ్యడంలో *దైనిక్ భాస్కర్, హరిభూమి, ఇండియా టుడే* మొదలైన మీడియా సంస్థలు క్రియాశీలంగా పని చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని రెండు పెద్ద దినపత్రికలైన *దైనిక్ భాస్కర్, హరిభూమి* యాజమాన్యాలకు ఆదివాసులను జల్-జంగల్-జమీన్ నుండి బేదఖలు చేసే అనేక ప్రజావ్యతిరేక ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వుంది. రాయగఢ్ జిల్లాలోని ధరంజయ్‌గఢ్‌లో *దైనిక్ భాస్కర్* గ్రూపుకు చెందిన డి.బి. పవర్ లిమిటెడ్ అనే కంపెనీ ఒక బొగ్గు గనిని ప్రారంభించడం కోసం 1713 ఎకరాల భూముల్ని రైతుల నుండి స్వాధీనం చేసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నదన్న ఒక్క వుదాహరణ చాలు, వీళ్ల ప్రయోజనాలేంటో అర్థం చేసుకోవడానికి. ప్రజల ప్రతిఘటన, మావోయిస్టుల వునికి కారణంగా ఈ పత్రికల యజమానులు ఛత్తీస్‌గఢ్‌లోని చాలా ప్రాంతాల్లో మైనింగ్ కార్యకలాపాల్ని ప్రారంభించడంలో, రైతుల నుండి భూముల్ని లాక్కోవడంలో ఎన్నో 'ఇబ్బందులె'దుర్కుంటున్నారు! బొగ్గు, విద్యుత్ రంగాలకు సంబంధించిన వీళ్ల లీజులెన్నో ప్రమాదంలో వున్నాయి. కాబట్టి ఇలాంటి **కార్పొరేట్ ప్రభువులు నడిపే పత్రికలు, టి.వి. ఛానెళ్లు ఈ మానసిక యుద్ధంలో క్రియాశీల పాత్ర పోషించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.**

## న్యాయం పక్షాన నిలబడ్డ వాళ్లను వేటాడుతున్న రాజ్యం

అన్యాయం, అబద్ధాలపై ఆధారపడి మానసిక యుద్ధం సాగించే పాలకవర్గాలు నిజం మాట్లాడే వాళ్లను, న్యాయం వైపు నిలబడే వాళ్లను ఎలా సహిస్తాయి? నిన్నటి సల్వాజుడుం నుండి నేటి ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాకా ఛత్తీస్‌గఢ్‌లో నిజం మాట్లాడే వాళ్లపై, రాసే వాళ్లపై ఎన్నో ఫాసిస్టు దాడులు జరిగాయి. సల్వాజుడుం బీభత్సాల్ని రిపోర్టు చేసినందుకు కమలేష్ పైక్రా, అఫ్జల్ ఖాన్ అనే ఇద్దరు జర్నలిస్టులను పోలీసులు వేధించి, కొట్టి, చంపుతామని బెదిరించారు. దేశవ్యాప్తంగా విలేకరులు, ప్రజాస్వామికవాదులు దీన్ని ఖండించి వీళ్ల పట్ల సంఘీభావం ప్రకటించడంతో వీళ్లు బతికిపోయారు. ఇప్పటికీ దంతెవాడ, జగ్దల్‌పూర్ తదితర చోట్లలో విలేకరులను చంపుతామని బెదిరించడం పోలీసు అధికారులకు అలవాటుగా మారిపోయిందంటే అతిశయోక్తి కాదు. సల్వాజుడుం మొదలైన రోజుల్లో బీజాపూర్ ఎస్.పి. కె.ఎల్. మన్‌హర్ 'నక్సలైట్ల వార్తల్ని కవర్ చేయడానికి మీడియా వాళ్లు ఎవరొచ్చినా చంపెయ్యండి' అని తన బలగాలకు పంపిన వైర్‌లెస్ సందేశాన్ని ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే కాదు, మొత్తం దేశమంతా టి.వి.ల ద్వారా విన్నది. అయితే ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అతన్ని మానవ హక్కుల కమిషన్‌కు బదిలీ చేసింది!

సల్వాజుడుంను తొలి నుండి వ్యతిరేకించినందుకు, ఆదివాసుల పక్షాన గట్టిగా నిలబడ్డందుకు మానవహక్కుల కార్యకర్త, పి.యు.సి.ఎల్. ఉపాధ్యక్షుడు డాక్టర్ బినాయక్ సేన్‌ను రమన్ ప్రభుత్వం జైలుపాలు చేసి, చివరికి యావజ్జీవ శిక్ష కూడా విధించింది. సల్వాజుడుం కాలంలో బస్తర్‌లో పర్యటించి నిజానిజాలు తెలుసుకోవడానికి వచ్చిన అనేక నిజనిర్ధారణ బృందాలను పోలీసులు, గూండాలు కొట్టి, అవమానించి వెనక్కి పంపించారు. వనవాసీ చేతనా ఆశ్రమాన్ని నడిపే హిమాంశు కుమార్ అనే గాంధేయవాది ఆదివాసులపై జరుగుతున్న రాజ్యహింసను ప్రశ్నించినందుకు, అతని ఆశ్రమాన్ని కాలబెట్టి మొదట దంతెవాడకు పారిపోయేలా చేసి, చివరికి ఛత్తీస్‌గఢ్‌లో ఎక్కడా వుండనివ్వకుండా తరిమేసారు. బస్తర్ అడవుల్లో పర్యటించి 'ఔట్‌లుక్' పత్రికలో వ్యాసం రాసినందుకు అరుంధతి రాయ్‌పై ఛత్తీస్‌గఢ్‌లో అనేక తప్పుడు కేసులు నమోదు చేసి ఆమె ఇక్కడ అడుగుపెట్టలేని వాతావరణం సృష్టించారు.

మావోయిస్టులతో సంబంధాలున్నాయనే నెపంతో పోలీసులు 2008లో అరెస్టు చేసిన 70 సంవత్సరాల ఫ్రీలాన్స్ జర్నలిస్టు ప్రఫుల్ ఝూను, విప్లవ రచయిత, 'ఎ వరల్డ్ టు విన్' హిందీ పత్రిక సంపాదకుడు అసిత్ సేన్‌గుప్తాను ఇప్పటికీ వదిలి పెట్టలేదు. అసిత్ సేన్‌గుప్తాకు 8 ఏళ్ల ఖైదు విధించారు. సల్వాజుడుం బర్బరత్వాన్ని ఒక వీడియో సి.డి. ద్వారా ప్రపంచానికి చాటారన్న అభియోగంపై మాలతి అనే మావోయిస్టు కార్యకర్తకు, సురేంద్ర కోసరియా అనే కార్మికుడికి పదేళ్ల శిక్ష విధించారు. ఈ మధ్యనే, 2012 మార్చ్ 4న ఛత్తీస్‌గఢ్ పోలీసులు భిలాయ్ నగరంలో రేఖా పర్గనిహా అనే యువ న్యాయవాదిని 'తీవ్రవాద సాహిత్యాన్ని' కలిగి వుందనే ఆరోపణపై అరెస్టు చేశారు. మావోయిస్టుల పేరుతో జైలు పాలయిన అనేక మంది ఆదివాసుల కేసుల్ని వాదించడమే ఈ మహిళ చేసిన నేరం! విలేకరులను, డాక్టర్లను, న్యాయవాదులను, ఆఖరుకు గాంధేయులను కూడా వదలకుండా వేధిస్తున్న రాజ్యం సాధారణ ఆదివాసులపై ఎంత బర్బరత్వానికి పాల్పడుతున్నదో వూహించుకోవచ్చు. మొత్తంగా దండకారణ్యవ్యాప్తంగా నేడు దాదాపు మూడు వేల మంది ఆదివాసులు వివిధ జైళ్లల్లో తప్పుడు కేసులతో మగ్గుతున్నారు. **ఇప్పుడు ఈ యుద్ధంలోకి సైన్యం ప్రత్యక్షంగా దిగుతున్న నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో జీవించే హక్కు సహా ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్యం, పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వాతంత్ర్యం వంటి విలువలు మరింత తీవ్రమైన ప్రమాదంలో పడతాయనేది స్పష్టం.**

## ప్రజలపై యుద్ధాన్ని సాహసంగా ఎదిరిస్తున్న ప్రజ

గతంలో ఫాసిస్టు సల్వాజుడుం అణచివేత క్యాంపెయిన్‌ను ఓడించిన అనుభవంతో ప్రజలు ప్రస్తుత ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను కూడా ఎంతో సాహసంగా ఎదుర్కుంటున్నారు. నిత్య దమనకాండల మధ్యనే వాళ్లు పోరుబాటలో ముందుకు సాగుతున్నారు. సల్వాజుడుంను ఓడించడంలో దండకారణ్య ప్రజలు పి.ఎల్.జి.ఏ.తో కలిసి ప్రజాయుద్ధంలో పోషించిన పాత్ర ఎంతో ప్రముఖమైంది. 2009 నుండి ప్రారంభమై కొనసాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించే లక్ష్యంతో సాగుతున్న ఆత్మరక్షణా యుద్ధంలో కూడా ప్రజలు క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ఈ ప్రజా ప్రతిఘటనా చర్యల ఫలితంగా పోలీసు, అర్ధసైనిక బలగాలు పెద్ద ఎత్తున నష్టపోవడంతో పాటు వాళ్ల మనోస్థైర్యం కూడా పలు సందర్భాలలో దిగజారిపోతున్నది.

ప్రభుత్వ సాయుధ బలగాల దాడులు, అరెస్టులు, చిత్రహింసలు, మహిళలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు రోడ్లపైకి వస్తున్నారు. అరెస్టు చేసిన వాళ్లను విడిపించుకోవడానికి పోలీసులతో తలపడుతున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో చంపబడిన వాళ్ల శవాల కోసం, లాకప్ హత్యలకు వ్యతిరేకంగా పోలీసు స్టేషన్లను/క్యాంపులను ఘెరావ్ చేస్తున్నారు. రోడ్లపై చక్కాజామ్ చేస్తున్నారు. మైనింగ్, భారీ డ్యాంలు, భారీ పరిశ్రమలు తదితర వినాశకర ప్రాజెక్టులకు వ్యతిరేకంగా, 'జల్-జంగల్- జమీన్‌పై అధికారం మాదే'నంటూ, 'దండకారణ్యం మాది, దోపిడీదొంగల జాగీరు కాద'నీ, 'ప్రాణాలయినా అర్పిస్తాం, భూముల్ని మాత్రం వదలం' అంటూ నినదిస్తూ ఊరేగింపులు, సభలు, సమావేశాలతో పాటు మిలిటెంట్ వుద్యమాలు కూడా నడుపుతున్నారు. ఇప్పుడు దండకారణ్య ప్రజలు ఈ గడ్డపై జరుగుతున్న సైన్యం మోహరింపుకు వ్యతిరేకంగా వుద్యమాలలో కదులుతున్నారు. సైన్యం నిర్మించబోతున్న శిక్షణ స్కూలుకు వ్యతిరేకంగా మాడ్ ప్రజలు మొట్టమొదట నారాయణపూర్ పట్టణంలో ఊరేగింపు తీశారు. 'భారత సైన్యం వెనక్కి పోవాలి', 'మాడ్‌పై శిక్షణా స్కూలు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి' వంటి నినాదాలు చేశారు. బస్తర్ సహా మొత్తం దండకారణ్యంలో సైన్యానికి వ్యతిరేకంగా ప్రజా వుద్యమాలు నడుస్తున్నాయి. నారాయణపూర్‌తో పాటు అంతాగఢ్, కోయిలిబేడలలో కూడా సైన్యానికి వ్యతిరేకంగా ధర్నాలు, ఊరేగింపులు జరిగాయి. దండకారణ్య ప్రజలు సైన్యం మోహరింపుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ క్యాంపెయిన్‌ను చేపట్టి రాష్ట్రపతికి పంపించారు. బోధ్‌ఘాట్ డ్యాంతో పాటు పలు చోట్ల ప్రతిపాదిత గనులను, భారీ స్టీల్‌ప్లాంట్‌లను వ్యతిరేకిస్తూ, ఐదవ షెడ్యూలు, 'పెసా' చట్టం ప్రకారం ప్రజలకు ఇవ్వబడిన అధికారాలను ప్రభుత్వాలే స్వయంగా వుల్లంఘించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు గ్రామసభల్లో తీర్మానాలు చేస్తూ భూములు ఇవ్వబోమని ప్రకటిస్తున్నారు.

## విప్లవప్రతిఘాతక, అభివృద్ధినిరోధక, అన్యాయ యుద్ధం ఇది!

విప్లవోద్యమాన్ని, ప్రజాస్వామిక, ప్రగతిశీల ప్రజా వుద్యమాలన్నిటిని అణచివేసే లక్ష్యంతో సాగుతున్న ఈ ప్రభుత్వ యుద్ధం స్వభావ రీత్యా ప్రజావ్యతిరేకమైంది. దేశ పాలకవర్గాలైన భూస్వామ్యవర్గం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం తమ సామ్రాజ్యవాద ప్రభువుల ప్రయోజనాలను నెరవేర్చడం కోసం కార్మిక-కర్షకులు సహా పీడిత వర్గాలన్నిటిపై సాగిస్తున్న యుద్ధం ఇది. దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాలు తమ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెల్లుబుకుతున్న ప్రజా ప్రతిఘటనను, ప్రజా వుద్యమాలను అణచడానికి చేస్తున్న యుద్ధం ఇది. అందుకే ఇది అన్యాయమైన యుద్ధం, అభివృద్ధి నిరోధక యుద్ధం. దేశ సంపదలన్నీ బహుళజాతి కంపెనీలకు, బడా నిరంకుశ పెట్టుబడిదారీ కంపెనీలకు కట్టబెట్టడం కోసం, ప్రజలను, ముఖ్యంగా ఆదివాసులను తమ జల్-జంగల్-జమీన్‌ల నుండి బేదఖలు చేయడం కోసం సాగుతున్న యుద్ధం ఇది. దండకారణ్య ప్రజలు తమను తామే పాలించుకోవడం కోసం ఏర్పాటు చేసుకున్న 'విప్లవ జనతన సర్కార్'ను, దాని నాయకత్వంలో ముందుకు తెస్తున్న స్వావలంబన ఆధారిత అభివృద్ధి నమూనాను నాశనం చేయడం కోసం సాగుతున్న యుద్ధం ఇది. విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ను, దాని నాయకత్వంలో పోరాడుతున్న ప్రజా విముక్తి

గెరిల్లా సైన్యాన్ని (పి.ఎల్.జి.ఏ.) సమూలంగా నిర్మూలించడం కోసం చేస్తున్న యుద్ధం ఇది. ఈ యుద్ధంలో ప్రస్తుత బూటకపు ప్రజాస్వామ్యాన్ని, కుళ్లిన పార్లమెంటరీ వ్యవస్థను నెత్తికెత్తుకున్న పార్లమెంటరీ పార్టీలన్నీ ప్రజలకు వ్యతిరేకంగా ఒక్కతాటిపై నిలబడ్డాయి. **ఈ యుద్ధంలో ప్రజలకు వ్యతిరేకంగా అత్యంత ధనాఢ్యులైన కార్పొరేట్ సంస్థల, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకు అంకితమైన పోలీసు బలగాలు, అర్ధసైనిక బలగాలు, ప్రత్యేక కమాండో బలగాలు, ప్రజావ్యతిరేక గూండా మూకలు, భారత సైన్యం, వాయుసైన్యం, వాటికి చెందిన అన్ని రకాల ఇంటలిజెన్స్ విభాగాలు మోహరించి వున్నాయి. కాగా మరోవైపు నిలిచింది ప్రధానంగా సాంప్రదాయక ఆయుధాలతో, నాటు ఆయుధాలతో సాయుధమై జీవన్మరణ సంగ్రామంలోకి దిగిన గోచిపాతలతో, ఆకలి కడుపులతో అలమటించే పీడితుల సైన్యం. పూర్తిగా అసమాన శక్తుల మధ్య యుద్ధం ఇది!** ప్రస్తుతం ఈ యుద్ధానికి వెంటనే గురవబోతున్నది మాడ్ ప్రాంతం. బైటి సమాజం, పాలకవర్గాలు 'అబూజ్‌మాడ్'గా వ్యవహరిస్తూ అభివృద్ధికి ఆమడ దూరంలో వుంచబడ్డ ప్రాంతం. **ఈ మాడ్‌వాసులు ప్రస్తుతం ఇక్కడ దిగుతున్న సైన్యం మూలంగా తమ ప్రాచీన ఆవాస ప్రాంతాల నుండి తరిమివేయబడి, నిర్వాసితులుగా మారే లేదా నిర్మూలించబడే ఒక పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. తాము తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న అద్భుతమైన జీవన విధానాన్ని, నరనరానా జీర్ణించుకున్న సహకార తత్వాన్ని, సమిష్టి భావనను, గొప్ప సంస్కృతిని, భాషను... అన్నిటినీ కోల్పోయే భారీ వినాశకాండ అంచుల్లో నిలబడి వున్నారు.**

## దీన్ని ఆపడానికి మనమేం చెయ్యగలం?

ప్రజలే చరిత్ర నిర్మాతలనే సత్యం చరిత్రలో ఇప్పటికే అనేక సార్లు రుజువైపోయింది. దేశ సార్వభౌమత్వాన్ని, దేశ సహజ సంపదలను, వనరులను, మొత్తంగా దేశ భవిష్యత్తును కాపాడుకోవడం కోసం సాగే పోరాటంలో ప్రజలదే కీలకపాత్ర. అన్యాయమైన యుద్ధాలను ఆపగలిగే శక్తి, వాటిని ఓడించే శక్తి కలిగిన వాళ్లు కేవలం ప్రజలు మాత్రమే. కనుక మన కళ్ల ముందర జరుగుతున్న ఈ అతి పెద్ద మానవ హననాన్ని, 'ప్రజలపై యుద్ధాన్ని' ఆపడానికి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, చురుకుగా, క్రియాశీలంగా కదిలి విస్తృత, సమరశీల, సమైక్య ప్రజా వుద్యమాన్ని చేపట్టడం నేటి అవసరం. ఈ ప్రజా వుద్యమం ఈ కింది డిమాండ్లతో దేశం నలుమూలలా విస్తరించాలి. ఇందులోకి విశాల ప్రజారాసులను సమీకరించాలి.

- ✶ ప్రజలపై యుద్ధం – ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే ఆపాలి.
- ✶ ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో, సరాయిపాలీలో సైనిక శిక్షణా స్కూళ్ల ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి. సైన్యం శిక్షణను, మోహరింపును వెంటనే ఆపాలి.
- ✶ బస్తర్, రాజ్‌నాంద్‌గాం, గడ్చిరోలి జిల్లాలతో పాటు మావోయిస్టు వుద్యమ ప్రాంతాలన్నిటి నుండి సి.ఆర్.పి.ఎఫ్., బి.ఎస్.ఎఫ్., ఐ.టి.బి.పి. తదితర అర్ధసైనిక బలగాలన్నిటినీ వెనక్కి రప్పించాలి.
- ✶ నాలుగు నెలలలోగా స్కూలు భవనాల నుండి సాయుధ బలగాల్ని ఖాళీ చేయించాలని 2011 జనవరి 18న వెలువడ్డ సుప్రీంకోర్టు తీర్పును వుల్లంఘించిన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంపై చర్య తీసుకోవాలి. సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తూ స్కూలు భవనాలన్నిటి నుండి ప్రభుత్వ సాయుధ బలగాలను వెంటనే ఖాళీ చేయించాలి.
- ✶ 2011 జూన్ 5 సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేస్తూ కోయ కమెండోలను, ఎస్.పి.ఓ.లను మారు పేర్లతో కొనసాగిస్తూ వాళ్లతో చట్టబాహ్యమైన కార్యకలాపాలు చేయిస్తున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంపై కోర్టు ధిక్కారం కేసు నమోదు చేసి విచారించాలి.
- ✶ బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే ఆపెయ్యాలి. 2005 నుండి ఇప్పటి వరకు దండకారణ్యంలో జరిగిన అన్ని ఎన్‌కౌంటర్ హత్యలపై; లాకప్ హత్యలపై; ముఖ్యంగా హరియాల్, సింగవరం, వెచ్చపాడ్, సింగనమడుగు, గచ్చన్‌పల్లి, గొంపాడు, కోకవాడ, తాకిలోడ్, ఓంగ్‌నార్, జెగురుగొండ, సావర్‌గాం తదితర సామూహిక హత్యాకాండన్నిటిపై స్వతంత్ర న్యాయవిచారణ జరిపించాలి. దోషులైన అధికారులను కఠినంగా శిక్షించాలి.
- ✶ మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డ పోలీసు, పారామిలిటరీ బలగాలను, ఎస్.పి.ఓ., కోయ కమాండో, సల్వాజుడుం గూండాలందరినీ కఠినంగా శిక్షించాలి.
- ✶ ఛత్తీస్‌గఢ్, విదర్భ ప్రాంత జైళ్లల్లో మావోయిస్టుల పేరుతో నిర్బంధించబడ్డ 3 వేల మంది ఆదివాసులపై మోపిన కేసులన్నీ వుపసంహరించుకొని బేషరతుగా విడుదల చేయాలి. రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి.
- ✶ గ్రామాలను, ఇండ్లను కాలబెట్టడాన్ని వెంటనే ఆపెయ్యాలి. 2005 నుండి ఇప్పటి వరకు ప్రభుత్వ సాయుధ బలగాలు సాగించి విధ్వంసకాండలన్నిటిపై స్వతంత్ర న్యాయవిచారణ జరిపించి దోషులను శిక్షించాలి.
- ✶ దండకారణ్య ప్రాంతంలో ప్రజల అస్తిత్వానికి ముప్పుగా పరిణమించిన, కార్పొరేట్ సంస్థలతో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు చేసుకున్న ఎం.ఓ.యు.లన్నిటినీ రద్దు చేయాలి.
- ✶ ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక ప్రజా భద్రతా చట్టం (సి.ఎస్.పి.ఎస్.ఏ.), మకోకా (మహారాష్ట్ర సంఘటిత నేరాల నిరోధక చట్టం), యు.ఏ.పి.ఏ. (చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం), సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం (ఎ.ఎఫ్.ఎస్.పి.ఏ.), రాజద్రోహం తదితర ఫాసిస్టు చట్టాలను రద్దు చేయాలి. దేశ అంతర్గత వ్యవహారాలపై అమెరికా పట్టును మరింతగా పెంచుతూ, 'ఉగ్రవాదం'

ముసుగులో న్యాయమైన ప్రజా వుద్యమాలన్నిటినీ అణచివేసే వుద్దేశంతో ముందుకు తెస్తున్న ఫాసిస్టు ఎన్.సి.టి.సి. (జాతీయ వుగ్రవాద వ్యతిరేక కేంద్రం) ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి.

✶ ప్రజా వుద్యమాల అణచివేతలో భాగంగా మానవరహిత విమానాలను వుపయోగించడాన్ని వెంటనే ఆపెయ్యాలి.

## రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఆర్.డి.ఎఫ్.)

**(జూన్ 7, 2012న ప్రచురించి విడుదల చేసినది)**